ఎన్నికల ప్రత్యేక అనుబంధ సంచిక

RNI Regd. APTEL No. 2009/29147 Postal Regd. No. J/NLR/078/20-22

# ఆంధ్రలక్ష్మి

జాతీయ తెలుగు వార పత్రిక



సంపుటి : 15 | సంచిక : 33 | ఎడిటర్ : ఎస్.కె. గౌస్‌బాషా | తేది : 29-04-2024 | పేజీలు : 8 | వెల : 6/-

# పోటాపోటీగా ఆంధ్రా సంకుల సమరం








## రెండు వర్గాల్లోనూ పైకి ధీమా.. లోపల గుబులు..!

ఆంధ్రా ఎన్నికల యుద్ధంలో కీలక ఘట్టం ముగిసింది. నామినేషన్ల పర్వం పూర్తయింది. బరిలో నిలిచేదెవరో తేలిపోయింది. నామినేషన్ల ఉపసంహరణ కూడా పూర్తయితే పూర్తి పిక్చర్ కనిపిస్తుంది. అయితే.. మరో 15 రోజుల్లోనే ఎన్నికలు ఉన్నా.. ఇంకా ఏ పార్టీకీ అనుకూలత కనిపించకపోవడం ఈసారి ఎన్నికల ప్రత్యేకత. ఏపీ ఎన్నికల్లో ఇలాంటి హోరాహోరా పోరు గతంలోనూ చాలాసార్లు సాగింది. హోరాహోరీ పోరాటాలు ఉన్నా.. ఏ పార్టీకి ఎడ్జ్ ఉందో పసికట్టే వీలు ఉండేది. కాస్త గాలి కనిపించేది. కానీ.. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం హోరాహోరీ పోరులో ఎవరు గెలుస్తారో కచ్చితంగా చెప్పలేని పరిస్థితి ఉంది. రాష్ట్రం మొత్తం మీద చూస్తే.. చెరో 70 సీట్లపై రెండు శిబిరాల్లోనూ ధీమా కనిపిస్తోంది. మిగిలిన 35 సీట్లే ఎవరికి అధికారమో తేల్చి చెప్పబోతున్నాయి. చంద్రబాబు ముందుగానే వేల్కొని పవన్ కల్యాణ్‌ను బతిమాలి ఒప్పించి.. ఢిల్లీ వెళ్లి బీజేపీ పెద్దల వద్ద సాగిలపడి మరీ కూటమి కట్టినా కూడా గ్రౌండ్‌లో వార్ వన్ సైడ్‌గా కనిపించట్లేదు. నరాలు తెగే పోరాట దృశ్యాలే ఎక్కడ చూసినా కనిపిస్తున్నాయి. ఇక ప్రాంతాల వారీగా చూస్తే.. జగన్‌కు రాయలసీమ కంచుకోట. గత అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 54 సీట్లలో ఏకంగా ఇక్కడ 49 సీట్లు వైసీపీ గెలుచుకుంది. అయితే ఈసారి మాత్రం రాయలసీమలో వైసీపీకి ఆ స్థాయి మద్దతు కనిపించట్లేదు. కొన్ని సీట్లు పోయేలా ఉన్నాయి. అయితే రాయలసీమలో పడే గండిని ఉత్తరాంధ్ర కొంత పూడ్చేలా కనిపిస్తోంది. ఇక్కడ వైసీపీకి సానుకూలత కనిపిస్తోంది. నెల్లూరు, ప్రకాశం వంటి వైసీపీ కంచుకోటల్లోనూ కాస్త తేడా కనిపిస్తోంది. హోరాహోరీ పోరులో కాస్త కూటమికి ఎడ్జ్ కనిపిస్తోంది. ఇక ఉభయ గోదావరి జిల్లాల్లో కూటమికి అనుకూలంగా

(తరువాయి 2వ పేజీలో)

# 'మేసేజ్'లు... ఫోన్‌కాల్స్‌తో అసహనానికి గురిచేస్తున్న రాజకీయ పార్టీలు




పదుల సంఖ్యలో ఫోన్‌కాల్స్... అంతకు మించి మెసేజ్‌లు... ఒకే టెన్షన్... సామాన్యులను అతలాకుతలం చేస్తున్న ఫోన్‌కాల్స్.... మెసేజ్‌లు...! గత రెండు నెలలుగా ఫోన్ కలిగి వున్న ప్రతి వ్యక్తికి ఈ ఇబ్బంది తప్పడంలేదు. అధికారంకోసం... ఆధిపత్యం కోసం ఏవిధంగానైనా తమ ఉనికిని కాపాడుకునే క్రమంలో రాజకీయనాయకులు చేస్తున్న కసరత్తులో ఇదో భాగం అయిపోయింది. ఓటరును తమవైపు తిప్పుకునేందుకు నాయకులు ప్రతినిత్యం సామాన్య ఓటర్లను ఫోన్‌కాల్స్‌తోను, మెసేజ్‌లతోనూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఏ ముఖ్యమైన పనులమీద ఉన్నప్పటికీ... ఈ ఫోన్ కాల్స్, మెసేజ్‌లు రావడంతో ఏదైనా తమకు సంబంధించిన, అవసరమైన ఫోన్‌కాల్ ఏమోనని ఎదురుచూసి ఆన్‌చేస్తే... అంతా... రాజకీయనాయకుల గొడవే..! ఆ హామీలు.. తప్ప! మెసేజ్‌లు సైతం ఇదేతరహాలో ప్రతినిత్యం ఇవి సందిగ్ధంలో పడవేసి సామాన్యులు తమ పనిని చేసుకోనివ్వకుండా ఇబ్బందిపెట్టే స్థాయికి చోటుచేసుకొంటున్నాయి. డేటా గోప్యంగా వుందని అధికారులు ప్రకటించుకొంటున్నప్పటికీ ఇలా కోట్లాది ఫోన్ నెంబర్లు నాయకుల చేతికి ఎలా చిక్కాయని అన్నది సమాధానంలేని ప్రశ్న? గడపగడపకు వెళ్లే రాజకీయనాయకుల ప్రతినిధులు ఈ ఫోన్ నెంబర్లు సేకరించి ఆయా నాయకులకు చేరవేశారా? లేదా ప్రముఖ నెట్‌వర్క్ సంస్థల నుంచి నాయకులు వినియోగదారుడితో సంబంధం లేకుండా ఫోన్ నెంబర్లు సేకరించారా? అనే విషయంపై ఎన్నికల కమిషన్ దృష్టిసారించి అక్రమ ఫోన్‌కాల్స్, మెసేజ్‌లతో సామాన్యులను ఇబ్బందిపెడుతున్న నెట్‌వర్క్ విభాగాలపై కఠినచర్యలు తీసుకొని నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా వుందని ప్రజలు ఆశిస్తున్నారు. ఒక వ్యక్తి సమాచారం, ఆ వ్యక్తికి సంబంధించిన వారి కుటుంబ సభ్యులకు తప్ప ఇతరులకు ఎలా చేరుతుందనే విషయంపై కూడా ఎన్నికల కమిషన్ దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా వుందని ప్రజలు కోరుతున్నారు. అలాగే తమ అనుమతి లేకుండా నెట్‌వర్క్ సంస్థలు ఫోన్ నెంబర్లు రాజకీయనాయకులకు చేరవేయడం చట్ట విరుద్ధమని తెలిసినా కూడా అవేవీ పట్టనట్లుగా రాజకీయ నాయకులకు చేరవేస్తున్నట్లు సమాచారం. ఒకప్రక్క వ్యాపార ప్రకటనలకు, మైక్రో ఫైనాన్స్ సంస్థల యాజమాన్యాల వేధింపులకు, ఇతర మెసేజ్‌లకు అతలాకుతలం అవుతున్న సామాన్యుడు ఈ రాజకీయనాయకుల ఫోన్ కాల్స్‌తో మరింత బెంబేలెత్తిపోతున్నట్లు సమాచారం. ఈ నెట్‌వర్క్ సంస్థలపై నియంత్రణ లేకపోతే సామాన్యుడు దైనందిన చర్యలకు పూర్తి ఆటంకం కలిగే పరిస్థితి ఏర్పడుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక వ్యక్తి యొక్క సమాచారం, ఫోన్ నెంబర్లు, ఇతర వివరాలు రాజకీయ పార్టీలు తెలుసుకోవడం పూర్తి చట్టవిరుద్ధమని తెలిసినా... రాజకీయ పార్టీలు అదేపంథాలో కొనసాగుతున్నాయి. ఒక వ్యక్తి యొక్క వ్యక్తిగత జీవితంపై తనకు పూర్తి స్వేచ్ఛ ఉన్నప్పటికీ... వివిధ ప్రైవేటు సంస్థల వేధింపులతో విసిగిపోవాల్సిన పరిస్థితి వచ్చింది. ఆ వేధింపులకు నేడు మొబైల్‌ఫోన్ వేదికగా మారడం సామాన్యుడికి భారంగా మారింది. ఎవరికి చెప్పాలో... ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియని అయోమయ స్థితిలో సామాన్యుడు ఈ అక్రమ ఫోన్‌కాల్స్... మెసేజ్‌లతో నలిగిపోతున్నాడు. ఈ ఫోన్‌కాల్స్‌పై నియంత్రణ కొనసాగించి ఎన్నికల కమిషన్ సామాన్యుడిని రక్షించాలని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

www.andhralaxmitelugu.in వెబ్‌సైట్‌లో వార్తలు చూడండి!

# బీజేపీ దయనీయ స్థితికీ ఇది నిదర్శనమా..!

ఒకవైపు తమ టార్గెట్ 400 లోక్ సభ సీట్లు అని కమలనాథులు ప్రకటించుకుంటూ ఉన్నారు! అయినా దేశ వ్యాప్తంగా అంత సానుకూల వేవ్ ఉన్నప్పుడు కమలం పార్టీ కొన్ని రకాల స్నేహాలు ఎందుకు చేస్తోంది? అనేది పెద్ద ప్రశ్న! అది కూడా తాము గతంలో తీవ్రంగా విమర్శించిన వాళ్లను బీజేపీ స్నేహితులుగా చేసుకుంది. వాళ్లేమీ తక్కువ తినలేదు బీజేపీని అనరాని మాటలూ అన్నారు! నితీష్ కుమార్, కుమారస్వామి, చంద్రబాబు నాయుడు.. వీరి సంగతి దేశానికంతా తెలిసిందే! ఏ ఎండకు ఆ గొడుగు పట్టే రకం! వీరిని బీజేపీ కూడా గతంలో రకరకాలుగా విమర్శించింది. కుమారస్వామి, చంద్రబాబులు బీజేపీని అవసరానికి వాడుకుని వదిలేసిన బాపతే! తమ అవకాశవాదం కొద్దీ వీరు బీజేపీతో స్నేహాన్ని, వైరాన్ని సాగించిన వారు, సాగిస్తున్న వారు! వీరి పార్టీలను బీజేపీ గతంలో తీవ్రంగా విమర్శించింది. కుటుంబ పాలన, అవినీతి అంటూ మోడీనే వీరిని విమర్శించారు! అదంతా అలా ఉంటే.. అనపర్తి సీటు విషయంలో బీజేపీ ఫీట్లు చాలు.. ఆ పార్టీ ఏంటి ఈ ఖర్మ అనే సందేహం రావడానికి! అనపర్తి విషయంలో బీజేపీ మొదట్లో చాలా హడావుడి చేసింది. మాజీ సైనికుడిని ఎన్నికల పోటీలో పెట్టినట్టుగా ఘనంగా ప్రకటించుకుంది. పొత్తులో భాగంగా బీజేపీ పోటీకి చంద్రబాబు నాయుడు కేటాయించిన సీట్లలో చాలా వరకూ చంద్రబాబు అతి సన్నిహితులే ఉన్నారు! వాళ్లంతా తెలుగుదేశంలో దశాబ్దాలుగా పని చేసిన వారు, చంద్రబాబు అవసరం కోసం బీజేపీలోకి వెళ్లిన వారే! అయితే వారికే బీజేపీ టికెట్లను కేటాయించింది. అనపర్తి విషయంలో అయితే మరీ దారుణం! ఒక మాజీ సైనికుడిని అభ్యర్థి అంటూ ప్రకటించి, చివరకు చంద్రబాబు ఒత్తిడికి తగ్గి, తెలుగుదేశం అభ్యర్థికే బీజేపీ కండువా వేసి టికెట్ ఇచ్చింది. ఈ ఎన్నికల వ్యవహారంలో ఇదో కామెడీ! ఒకవైపు దేశంలో తమ టార్గెట్ 400 లోక్ సభ స్థానాలు, మోడీకి తిరుగులేదు, బీజేపీ ఎదురులేదు.. అంటూ ప్రకటనలు చేసుకుంటూ, ఒక అసెంబ్లీ నియోజకవర్గం విషయంలో బీజేపీ తన నిర్ణయానికి కట్టుబడలేకపోయింది! గెలుపో ఓటమో.. మేం ఒక మాజీ సైనికుడికి టికెట్ ఇచ్చాం, తేల్చుకుంటాం.. అంటూ ముందుకు వెళ్లి ఉంటే, కనీసం ఆ ఒక్క సీటు విషయంలో అయినా బీజేపీ వెన్నెముకతో వ్యవహరించి ఉండాల్సింది! ఎలాగూ మిగతా సీట్లలో పోటీ అంతా సీఎం రమేష్ లు, సుజనా చౌదరులే కదా! కనీసం అభ్యర్థిని ప్రకటించినందుకు అయినా బీజేపీ కట్టుబడాల్సింది! అభ్యర్థిని మార్చడం కాదు, తెలుగుదేశం టికెట్ దక్కలేదని రోడ్డెక్కిన అతడికి కాషాయ కండువా వేసి, అతడిని అభ్యర్థిగా ప్రకటించి బీజేపీ కామెడీ చేస్తోంది! బీజేపీ జాతీయ నాయకత్వానికి ఈ కామెడీలు తెలియనివి కాకపోవచ్చు! మరి 400 లోక్ సభ సీట్లకు పొడిచే వాళ్లు మరీ ఇంత కామెడీ పీసులు అయిపోతారా! ఇది బీజేపీ దయనీయ స్థితికి నిదర్శనం కాదా?

# పోటాపోటీగా ఆంధ్రా సంకుల సమరం

(1వ పేజీ తరువాయి)

జనసేన ఎఫెక్ట్ బాగా కనిపిస్తోంది. కృష్ణా, గుంటూరు జిల్లాల్లోనూ రాజకీయ వాతావరణం కూటమికి సానుకూలంగా కనిపిస్తోంది. కృష్ణా, గూంటూరు జిల్లాల్లో రాజధాని మార్పు అంశం ప్రభావితం చూపుతోంది. వైసీపీ అనుకూల ఓటర్లు కూడా కూటమివైపుకు మొగ్గుతున్నారు. ఇలా ప్రాంతాల వారీగా చూసుకుంటే.. హోరాహోరీ పోరు కనిపిస్తున్న ప్రస్తుతానికి ఓవరాల్‌గా వైసీపీపై కూటమి ఓ ఐదు సీట్ల పైచేయిలో కనిపిస్తోంది. ముందుగానే టికెట్లు ప్రకటించి గ్రౌండ్ క్లియర్ చేసుకోవడం వైసీపీకి ప్లస్ అయ్యింది. చివరి నిమిషం వరకూ అభ్యర్థులను మార్చుకుంటూ ఉండటం వల్ల కూటమి అనుకున్నంతగా పాజిటివ్ వేవ్‌ను అందుకోలేకపోయింది. ఇక ప్రచారం విషయానికి వస్తే జగన్ పూర్తిగా సంక్షేమాన్నే నమ్ముకున్నట్టు కనిపిస్తోంది. సంక్షేమ పథకాల లబ్దిదారులకూ లబ్ది పొందని వారికీ మధ్య పోరాటంగా వర్ణిస్తున్నారు. దీనికే జగన్ అందంగా క్లాస్ వార్ అంటూ ఓ పదం కాయిన్ చేశారు. కూటమి పార్టీల విషయానికి వస్తే.. ఎంతసేపు జగన్‌ను వ్యక్తిగతంగా విమర్శించడం తప్ప.. తాము వస్తే ఎలాంటి అభివృద్ధి చేస్తామన్న అంశంపై ఎక్కువగా ఫోకస్ చేయకపోవడం మైనస్ అవుతోంది. వయస్సుల వారీగా చూస్తే.. 60 ఏళ్లు పైబడిన వాళ్లు పూర్తిగా వైసీపీ వైపు కనిపిస్తున్నారు. మహిళలు కూడా వైసీపీ వైపే బాగా మొగ్గు చూపుతున్నారు. అయితే యువత, 40 -50 ఏళ్ల ఏజ్ గ్రూప్ వారు మాత్రం వైసీపీ పాలన పట్ల వ్యతిరేకంగా ఉన్నారు. ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లేవన్నది వారి వాదనగా వినిపిస్తోంది. ప్రాంతాల వారీగా చూస్తే పట్టణ, నగర ఓటర్లు కూటమి వైపు మొగ్గు చూపుతున్నారు. అలాగని మొత్తం పట్టణ, నగర ఓటర్లు మొత్తం కూటమివైపు కూడా కాదు. అక్కడి మాస్ ఓటర్లు మళ్లీ వైసీపీ వైపే ఉన్నారు. ఇక గ్రామీణ ఓటర్లు వైసీపీ వైపు మొగ్గు చూపుతున్నారు. చివరగా కులాల వారీగా చూస్తే.. కమ్మలు, వైశ్యులు, క్షత్రియులు, బ్రాహ్మణ వర్గాలు టీడీపీకి అనుకూలంగా ఉన్నారు. రెడ్లు, మైనార్టీలు, క్రిస్టియన్లు, ఎస్సీ, ఎస్టీలు వైసీపీ వైపే మొగ్గు చూపుతున్న పరిస్థితి ఉంది. ఇక బీసీలలో మాత్రం చీలిక కనబడుతోంది. మొత్తం మీద గెలిచేది మేమే అని ఏ పార్టీ కూడా ఆత్మ విశ్వాసంతో చెప్పే పరిస్థితి లేదు. పైకి వైనాట్ 175 అని జగన్ బీరాలు పలుకుతున్నా.. ఇదిగో ప్రభుత్వం ఏర్పాటు చేయబోతున్నామని బాబు, పవన్ చెబుతున్నా పైపై గాంభీర్య ప్రకటనలే. ఇంకా పోలింగ్‌కు 15 రోజుల వరకూ సమయం ఉండటంతో ఈ పక్షం రోజులే.. ఏ పక్షం ఏపీని పాలించాలో డిసైడ్ చేసే కీలక పక్షంగా మారబోతోంది. ఈ పదిహేను రోజుల్లో ఇరు శిబిరాలు ఎలాంటి వ్యూహాలు అమలు చేస్తాయో చూడాలి. గెలుపు మాదే అంటూ దీమాగా చెబుతున్నా ఫలితం ఏమవుతుందో అన్న గుబులు మాత్రం రెండు శిబిరాల్లోనూ కనిపిస్తోంది.

# గ్రౌండ్ రియాల్టీ కేరాఫ్ వైకాపా మేనిఫెస్టో




పిల్లలు ఎన్ని డిమాండ్లు తండ్రి ముందు పెట్టినా, వాటిని ఎప్పుడు ఎలా నెరవేర్చగలను అన్నది తండ్రికి మాత్రమే తెలుసు. అప్పు చేయాలా? జీతం రావాలా? బడ్జెట్ సరిపోతుందా? అన్నది అతనికే క్లారిటీ వుంటుంది. సిఎమ్ కూడా అలాగే. ఆంధ్ర రాష్ట్ర ఆర్ధిక పరిస్థితి ఎలా వుంది అన్నది ఆంధ్ర సిఎమ్ కు క్లారిటీ వుంటుంది. వుంది కూడా. అలాగే అప్పుల పరిస్థితి, అవి పుట్టించేందుకు పడుతున్న ఇబ్బందులు అన్నీ తెలుసు. ఇలాంటి పరిస్థితుల్లో జగన్ కే కాదు, చంద్రబాబు కైనా వాగ్దానాలు నిలబెట్టుకోవడం కష్టమే. అయితే అధికారం సాధించాలంటే హామీలు కుమ్మరించాల్సిందే కనుక చంద్రబాబు ఆరు సూత్రాలు అంటూ ముందుకు వచ్చారు. జనం తన వైపు మొగ్గాలి అంటే జగన్ ను మించిన హామీలు ఇవ్వాలి కనుక ఇచ్చారు. ముందు అధికారం అంటూ సాధిస్తే తరువాత చూడొచ్చు. అప్పులు పుడితే జనాలకు ఇవ్వొచ్చు. లేదంటే లేదు. ఒకసారి జగన్ ను గద్దె దింపితే, వైకాపా ను లేకుండా చేసేస్తే, జగన్ ను అణగదొక్కేస్తే, ఇక ప్రజలకు దిక్కుండదు. హామీలు నెరవేర్చకపోయినా అడిగే పరిస్థితి వుండదు. ఇక జగన్ పరిస్థితి వేరు. ఇప్పటికే మేనిఫెస్టో మాగ్జిమమ్ అమలు చేసినా, నిత్యం ఎల్లో మీడియాలో చేయలేదు అంటూ యాగీ చేస్తున్నారు. అలాంటిది అలవి కాని హామీలు ఇస్తే విజయం వస్తుందేమో కానీ ఆ తరువాత ఎన్నికలకు ఇబ్బంది పడాల్సి వస్తుంది. వైకాపా మేనిఫెస్టో చూస్తుంటే అసలు జగన్ కు మళ్లీ కొత్త హామీలు ఇవ్వాలనే మూడ్ లేదని అర్థం అయిపోతోంది. ఏదో ఒకటి చెప్పాలనే ఆలోచనతో చెప్పినట్లు వుంది. ముఖ్యంగా పింఛన్లను ఎప్పుడో ఏళ్ల తరువాత పెంచుతాను అనడం నిజంగా మైనస్ నే. అంటే ఆంధ్ర ఆర్థిక పరిస్థితి అస్సలు బాగాలేదు అన్నది ఇప్పుడు మరింత స్పష్టంగా అర్థం అవుతోంది వైకాపా మేనిఫెస్టోతో. గతంలో జగన్ రెండేళ్లు పదవీ కాలం పెంచారు ప్రభుత్వ ఉద్యోగులకు. ఇప్పుడు అధికారంలోకి మళ్లీ వస్తే ఎదుర్కొనే ప్రధాన సమస్య అదే. ఉద్యోగులకు ఫైనల్ సెటిల్‌మెంట్లు కోసం చాలా మొత్తం కావాల్సి వుంటుంది. ఇవన్నీ జగన్ కు దృష్టిలో వుండే వుంటుంది. అందువల్ల కూడా కొత్త మేనిఫెస్టో ఇవ్వడం ఇష్టం వుండి వుండదు. పార్టీ నుంచి రైతు రుణ మాఫీ మీద వత్తిడి వచ్చినా జగన్ లొంగలేదు. అంటే గ్రౌండ్ రియాల్టీ బాగా తెలుసు. గ్రౌండ్ రియాల్టీ తెలిసినా, జగన్ అధికారం కోసం అలవికాని హామీలు ఇవ్వకపోవడం మెచ్చుకోదగ్గ విషయం. కానీ గ్రౌండ్ రియాల్టీ ఇలా వుండడానికి కారణం కూడా జగన్ ప్రవేశ పెట్టిన నగదు పథకాలే అన్నది బాధపడాల్సిన విషయం.

# ఎవరు గెల్చినా నష్టం షర్మిల కే!



జగన్ గెలుస్తారా.. చంద్రబాబు అధికారం సాధిస్తారా అన్న ప్రశ్నలు పక్కన పెడితే, ఎన్నికలు ముగిసిన తరువాత ఆటలో అరటిపండుగా మిగిలిపోయేది మాత్రం వైఎస్ షర్మిల మాత్రమే. ఎందుకంటే షర్మిల ఎంత మాత్రం నమ్మ దగిన వ్యక్తి కాదు అని అర్థం అయిపోయింది. అన్నతో గొడవల కారణంగా కావచ్చు, ఆస్తి తగాదాలు కావచ్చు. మరీ ఇంతలా రెచ్చిపోయి హడావుడి చేయడం అన్నది సరి కాదు. ఎందుకంటే ఇలాంటి వారిని ఎవరైనా దగ్గరకు తీయడానికి భయపడతారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీ సాధించేది ఏమీ వుండదు. అలా సాధించకపోయిన తరువాత కాంగ్రెస్ పార్టీ వ్యవహరించే తీరు వేరుగా వుంటుంది. దానికి జాలి, దయ లాంటివి ఏమీ వుండవు అనడానికి జగన్ ఉదంతమే ఉదాహరణ. జగన్ పవర్‌లోకి వస్తే షర్మిల పరిస్థితి దారుణంగా వుంటుంది. చంద్రబాబు పవర్ లోకి వస్తే, చూసీ, చూడనట్లు పక్కన పెడతారు తప్ప, తెచ్చుకుని నెత్తిన పెట్టుకోరు. ఎందుకుంటే గతంలో షర్మిల అన్న తరపున ప్రచారం సాగించి, చేసిన ప్రసంగాలను అంత సులువుగా మరిచిపోరు. ఇప్పుడు అంటే బాబు గారికి అవసరం కనుక, క్రిస్టియన్ ఓటు బ్యాంక్ చీలుస్తుందేమో అని సైలెంట్‌గా వున్నారు. చంద్రబాబు పవర్‌లోకి వస్తే, ఏదో కిందా మీదా పడి, బతిమాలుకుని కాస్త వ్యాపారాలు సాగించుకునే అవకాశం కొంతయినా వుంటుంది. కానీ జగన్ వస్తే మొత్తం సమస్యలే. అందువల్ల అన్నింటికి షర్మిల రెడీగా వుండాల్సి వుంటుంది.

# ఏపీ పవర్ పాలిటిక్స్‌లో కనిపించని నాలుగో సింహం ...!

ఆంధ్రప్రదేశ్ రాజకీయాలంటే ప్రధానంగా మూడు కులాల ప్రస్తావన వినిపిస్తుంది. ప్రధాన రాజకీయ పార్టీలకు కూడా కులాల ముద్ర ఉంది. రాష్ట్రంలోని 29 ఎస్సీ, 7 ఎస్టీ నియోజక వర్గాలు.. ఉత్తరాంధ్ర నియోజకవర్గాలు, మిగతా రాష్ట్రంలోని కొన్ని నియోజకవర్గాలు మినహా ఓవరాల్‌గా చూసుకుంటే కమ్మ, రెడ్డి కాపు కులాల చుట్టూ రాజకీయం తిరుగుతుంటుంది. స్థూలంగా ఆంధ్రప్రదేశ్‌ను కమ్మ, రెడ్డి, కాపు కుల రాజకీయ క్షేత్రంగానే చూస్తుంటారు. కాపులలో కాపు, తూర్పు కాపు, తెలగ, బలిజ వంటి విభజన ఉంటూ కొన్ని జనరల్, కొన్ని బీసీ కులాలుగా ఉన్నప్పటికీ రాజకీయంగా మాత్రం ఒకటే వర్గంగా పరిగణిస్తున్నారు. పార్టీలు తరచూ బీసీ మంత్రం జపించినా బీసీలు అనేది ఏ ఒక్క కులంగానో కాకుండా వేర్వేరు కులాలు కావడం వల్ల మళ్లీ ఆ మూడు ప్రధాన కులాల చుట్టూనే రాజకీయం తిరుగుతుంది. అయితే, 2024 ఎన్నికలలో ఈ మూడు కులాలతో పాటు మరో కులం పేరు కూడా ప్రధానంగా వినిపిస్తోంది. అది యాదవ కులం. పైకి ప్రస్ఫుటంగా కనిపించేంత పెద్ద సంఖ్యలో ఈ కులానికి పార్టీలు సీట్లు కేటాయించనప్పటికీ సంఖ్యాపరంగా, ఆర్థికపరంగా ఈ కులానికి ఉన్న పొటెన్షియాలిటీని రాజకీయ పార్టీలు గుర్తించాయన్న విషయం ఈ ఎన్నికలతో స్పష్టమవుతోంది. ఆ సమీకరణలతోనే అటు వైసీపీ కానీ, ఇటు టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి కానీ సీట్ల కేటాయింపులో యాదవ – కురుబలకు ప్రాధాన్యమిచ్చినట్లుగా అర్థమవుతోంది. 2009 ఎన్నికల వరకు బీసీలు తెలుగుదేశం వైపు మొగ్గుతో ఉండేవారు. 2019 తరువాత అయిదేళ్లలో బీసీలకు పదవులు ఇస్తూ వైసీపీ వారిని ఆకట్టుకుందని.. ఈ ఎన్నికలలోనూ టికెట్ల కేటాయింపులో వైసీపీ బీసీలను లెక్కలోకి తీసుకుందని ఆయన అభిప్రాయపడ్డారు. నరసరావుపేట, ఏలూరు లోక్‌సభ సీట్లలో వైసీపీ యాదవులకు టికెట్లు ఇవ్వడం వారికి ప్రాధాన్యమిచ్చిందనడానికి సూచన అని చెప్పారు. “అసెంబ్లీ సీట్ల విషయంలో గతం కంటే యాదవుల ప్రాధాన్యం సంఖ్యాపరంగా పెద్దగా పెరగనప్పటికీ నరసరావుపేట, ఏలూరు వంటి సెంట్రల్ ఆంధ్ర లోక్‌సభ నియోజకవర్గాలలో.. రాష్ట్రంలోని రాజకీయ ప్రాబల్యం ఉన్న కులాలకు పట్టున్న ఇలాంటి నియోజకవర్గాలలో యాదవులకు టికెట్లు ఇవ్వడమనేది పరిగణించదగ్గ విషయమే. ఆంధ్రప్రదేశ్‌లో ఈసారి ఎన్నికల హడావుడి మొదలైన ప్రారంభంలోనే టికెట్ల కేటాయింపు విషయంలో అనేక సమీకరణలు మొదలయ్యాయి. నరసరావుపేట లోక్‌సభ నియోజకవర్గంలో 2019లో వైసీపీ నుంచి గెలిచిన లావు కృష్ణదేవరాయులు వైసీపీని వీడి టీడీపీ గూటికి చేరడంతో ఆయన స్థానంలో కొత్త అభ్యర్థి కోసం వైసీపీ కసరత్తు చేసింది. నెల్లూరు సిటీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పోలుబోయిన అనిల్ కుమార్ యాదవ్ పేరు ఒక్కసారిగా తెరపైకి వచ్చింది. అది రాష్ట్రవ్యాప్త చర్చకు దారితీసింది. కమ్మ, రెడ్డి కులాలకు చెందిన నేతలే ఎక్కువగా గెలుస్తూ వస్తున్న ఈ నియోజకవర్గంలో రెండు జిల్లాల అవతల నుంచి యాదవ నేతను తీసుకొచ్చి పోటీ చేయించాలన్న వైసీపీ అధ్యక్షుడు జగన్ ఆలోచన చాలామందిని ఆశ్చర్యపరిచింది. అనిల్ యాదవ్ పేరునే జగన్ ఖరారు చేయడంతో ఈ ఎన్నికలలో కొత్త కుల సమీకరణలతో జగన్ ఎన్నికలకు వెళ్తున్నారన్న చర్చ రాష్ట్రవ్యాప్తంగా మొదలైంది. ఇక తెలుగుదేశం పార్టీ కూడా



ఏలూరు లోక్‌సభ నియోజకవర్గంలో ఇలాంటి అనూహ్య ఎంపికతో అందరినీ ఆశ్చర్యపరిచింది. ఏలూరులో సుదీర్ఘకాలంగా టీడీపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి కమ్మ అభ్యర్థులే గెలుస్తున్నారు. 2019లో తొలిసారి ఈ నియోజకవర్గంలో వైసీపీ గెలిచింది. వైసీపీ తరఫున పోటీ చేసిన వెలమ అభ్యర్థి కోటగిరి శ్రీధర్ ఇక్కడ గెలవడంతో ఇక్కడి కుల సమీకరణలు మారాయి. అయితే, ఈసారి 2019 సమీకరణలను కూడా మార్చుతూ వైసీపీ ఏలూరులో యాదవ అభ్యర్థిని ప్రకటించింది. జగన్ కేబినెట్లో మంత్రిగా ఉన్న కారుమూరి నాగేశ్వరరావు కుమారుడు సునీల్ యాదవ్‌ను ఏలూరు లోక్‌సభ అభ్యర్థిగా ప్రకటించింది. దాంతో టీడీపీ కూడా ఇక్కడ బ్యాలన్స్ చేయడానికా అన్నట్లు యాదవ అభ్యర్థినే బరిలో దించింది. అయితే, జగన్ తరహాలోనే చంద్రబాబు కూడా నాలుగైదు జిల్లాలు దాటించి ఉమ్మడి కడప జిల్లా నుంచి పుట్టా మహేశ్ యాదవ్‌ను ఏలూరు అభ్యర్థిగా తీసుకొచ్చారు. కృష్ణా జిల్లా మైలవరం విషయంలోనూ జగన్ ఇలాంటి వ్యూహమే అనుసరించారు. సుదీర్ఘ కాలంగా కమ్మ అభ్యర్థులే గెలుస్తూ వస్తున్న ఈ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి జగన్ తన పార్టీ తరఫున యాదవ అభ్యర్థిని ప్రకటించారు. వైసీపీ నుంచి ఇక్కడ సర్నాల తిరుపతిరావు అనే యాదవ నేతకు చాన్స్ ఇచ్చారు జగన్. మైలవరంలో కమ్మ సామాజికవర్గంతో పాటు యాదవ సామాజికవర్గ ఓట్లు కూడా చెప్పుకోదగ్గ సంఖ్యలో ఉండడమే జగన్ ఈ అడుగు వేయడానికి కారణం. ! ఇక ఉమ్మడి ప్రకాశం జిల్లాలో యాదవ ఓట్లు ఎక్కువగా ఉన్న కనిగిరి అసెంబ్లీ నియోజకవర్గం విషయంలోనూ జగన్ ఇలాంటి వ్యూహమే అనుసరించారు. ఎక్కువగా రెడ్డి నేతలు, ఒకరిద్దరు కమ్మ నేతలు గెలిచిన ఈ నియోజకవర్గంలో జగన్ యాదవ నాయకుడు దుద్దాల నారాయణ యాదవ్‌కు అవకాశమిచ్చారు. అయితే, జగన్ 2014, 2019 ఎన్నికలలోనూ ఈ నియోజకవర్గంలో జగన్ యాదవ అభ్యర్థులకే అవకాశమిచ్చారు. 2019లో వైసీపీ నుంచి బుర్రా మధుసూదన్ యాదవ్ ఇక్కడ గెలిచారు. ప్రస్తుత ఎన్నికలలో మధుసూదన్ యాదవ్‌ను కనిగిరి నుంచి కందుకూరుకు మార్చారు జగన్. ప్రస్తుత ఎన్నికలలో పాలక వైసీపీ నలుగురు యాదవ, ఇద్దరు కురుబ అభ్యర్థులకు అసెంబ్లీ నియోజక వర్గాలలో అవకాశం ఇచ్చింది. లోక్ సభ నియోజకవర్గాలలో ఇద్దరు యాదవ, ఒక కురుబ అభ్యర్థిని ప్రకటించింది. శాసన సభ నియోజక వర్గాలలో తణుకు నుంచి సిటింగ్ ఎమ్మెల్యే కారుమూరు నాగేశ్వరరావు, మైలవరంలో సర్నాల తిరుపతి రావు, కనిగిరిలో దద్దాల నారాయణ యాదవ్, కందుకూరులో బుర్రా మధుసూదన్ యాదవ్ పోటీ చేస్తుండగా హిందూపురంలో కురుబ సామాజిక వర్గానికి చెందిన తిప్పేగౌడ నారాయణ దీపికను బరిలో దించుతున్నారు. ఆమె అక్కడ తెలుగుదేశం సిటింగ్ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను ఎదుర్కోనున్నారు. ఇక పెనుకొండ నియోజకవర్గంలో మంత్రి ఉషశ్రీ చరణ్‌ను పోటీ చేయిస్తోంది వైసీపీ. ఆమె కూడా కురుబ సామాజికవర్గానికి చెందినవారే. లోక్‌సభ నియోజకవర్గాల విషయానికొస్తే ఏలూరు నుంచి కారుమూరు సునీల్ యాదవ్, నరసరావుపేటలో అనిల్ కుమార్ యాదవ్, అనంతపురంలో కురుబ నేత మాలగుండ్ల శంకరనారాయణ వైసీపీ నుంచి పోటీ చేస్తున్నారు. తెలుగుదేశం పార్టీ నుంచి మైదుకూరు అసెంబ్లీ నియోజకవర్గంలో పుట్టా సుధాకర్ యాదవ్, తునిలో యనమల దివ్య, చీరాలలో మద్దులూరి మాలకొండయ్య యాదవ్, నూజివీడులో కొలుసు పార్థసారథి, గాజువాకలో పల్లా శ్రీనివాసరావు పోటీ చేస్తున్నారు. ఏలూరు లోక్‌సభ స్థానం నుంచి పుట్టా మహేశ్ యాదవ్, హిందూపురం పార్లమెంటు స్థానం నుంచి కురుబ నేత బీకే పార్థసారథి, కర్నూలు లోక్‌సభ స్థానం నుంచి మరో కురుబ నేత బస్తిపాటి నాగరాజు టీడీపీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారు. అయితే, యాదవ సామాజికవర్గం నుంచి టీడీపీలో టికెట్లు సంపాదించినవారిలో ముగ్గురు ఒకే కుటుంబానికి చెందినవారు. టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడి కుమార్తె దివ్య కాగా, సుధాకర్ యాదవ్ వియ్యంకుడు.. మహేశ్ యాదవ్ అల్లుడు. జనసేన నుంచి పోటీ చేస్తున్న వారిలో విశాఖ సౌత్ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి వంశీకృష్ణ యాదవ్ వైసీపీ నుంచి ఎమ్మెల్సీగా ఉంటూ ఎమ్మెల్యే టికెట్ ఆశించారు. ఆ పార్టీలో టికెట్ రాకపోవడంతో జనసేనలో చేరి టికెట్ సంపాదించుకున్నారు. 2019 ఎన్నికలలో యాదవ సామాజికవర్గం నుంచి నలుగురు, కురుబ నుంచి ఇద్దరు ఎమ్మెల్యేలుగా గెలిచారు. మొత్తం ఆరుగురూ వైసీపీ నుంచే విజయం సాధించారు. యాదవులలో కారుమూరు నాగేశ్వర రావు తణుకు నుంచి, కె.పార్థసారథి పెనమలూరు నుంచి, కనిగిరి నుంచి బుర్రామధుసూదన్ యాదవ్, నెల్లూరు సిటీ నుంచి అనిల్ కుమార్ యాదవ్ గెలిచారు. వీరిలో కారుమూరు నాగేశ్వరరావు, అనిల్ కుమార్ మంత్రులయ్యారు. కురుబ కులం నుంచి ఉషశ్రీచరణ్, మాలగుండ్ల శంకరనారాయణ గెలిచారు. వీరిద్దరికీ జగన్ కేబినెట్లో స్థానం దక్కింది. మొత్తం ఆరుగురిలో పార్థసారథి ప్రస్తుత ఎన్నికలలో వైసీపీని వీడి టీడీపీ నుంచి పోటీ చేస్తున్నారు. ముగ్గురు యాదవ ఎమ్మెల్యేలు, ఒక కురుబ ఎమ్మెల్యే ఎన్నికలలో విజయం సాధించారు. వీరిలో టీడీపీ నుంచి ఇద్దరు యాదవ, ఒక కురుబ నేత గెలవగా.. వైసీపీ నుంచి ఒక యాదవ నేత గెలిచారు. టీడీపీ నుంచి గాజువాకలో పోటీ చేసిన పల్లా శ్రీనివాసరావు(యాదవ), తంబళ్ల పల్లెలో శంకర్ యాదవ్(యాదవ), పెనుకొండ బీకే పార్థసారథి(కురుబ) గెలిచారు. వైసీపీ నుంచి నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుంచి అనిల్ కుమార్ యాదవ్ అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 2009 ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ నుంచి ముగ్గురు యాదవ నేతలు అసెంబ్లీకి ఎన్నికయ్యారు. తణుకులో కారుమూరు నాగేశ్వరరావు, పెనమలూరులో పార్థసారథి, కళ్యాణదుర్గంలో ఎన్.రఘువీరారెడ్డి(కురుబ) గెలిచారు. ఆ ఎన్నికలలో టీడీపీ నుంచి కావలిలో యాదవ నేత బీద మస్తాన్ రావు, పెనుకొండలో కురుబ నేత బీకే పార్థసారథి గెలిచారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఉయ్యూరులో కొలుసు పార్థసారథి, గురజాలలో జంగా కృష్ణమూర్తి, మడకశిరలో రఘువీరారెడ్డి సామాజికవర్గం నుంచి గెలిచారు. ఆ ఎన్నికలలో టీడీపీ నుంచి తునిలో యాదవ నేత యనమల రామకృష్ణుడు విజయం సాధించారు. గన్నవరంలో ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన యాదవ నేత ముద్రబోయిన వెంకటేశ్వర రావు గెలిచారు. ఆంధ్రప్రదేశ్ జనాభాలో యాదవుల సంఖ్య 7 శాతానికి పైగా ఉన్నట్లు అనధికారిక లెక్కలు చెప్తున్నాయి. ప్రధాన పార్టీల టికెట్ల ప్రకటనకు ముందే ఏపీలోని కొన్ని నియోజకవర్గాలలో యాదవ నేతలు తమకు టికెట్లు ఇవ్వాలని డిమాండ్లు చేసిన ఘటనలున్నాయి. ఆయా నియోజకవర్గాలలో యాదవ ఓటర్ల సంఖ్య, అక్కడ వారికి ప్రాధాన్యమున్నా ప్రాతినిధ్యం లేకపోవడాన్ని ప్రస్తావిస్తూ టికెట్లు డిమాండ్లు చేశారు. పార్టీలలో పనిచేసే యాదవ నాయకులతో పాటు యాదవ కులసంఘాల నాయకులు కూడా రాజకీయ పార్టీలు తమ కులానికి చెందిన నేతలకు టికెట్లు ఇవ్వాలని పట్టుపట్టారు. ఇది కొన్ని చోట్ల ఫలించినా మరికొన్ని చోట్ల ఫలించకపోవడం అసంతృప్తికి దారి తీసింది కూడా. ముఖ్యంగా ఉత్తరాంధ్రలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యాదవులకు ఎక్కడా టికెట్లు ఇవ్వకపోవడాన్ని ఆ కులానికి చెందిన నాయకులు తప్పుపట్టారు. అంతేకాదు.. విశాఖ నగరంలో వైసీపీ నుంచి ఎమ్మెల్సీగా ఉన్న వంశీకృష్ణ యాదవ్ ఆ పార్టీకి రాజీనామా చేసి జనసేనలో చేరి విశాఖపట్నం సౌత్ అసెంబ్లీ నియోజకవర్గ టికెట్ సంపాదించారు. మరోవైపు గురజాల నియోజకవర్గంలోనూ యాదవ నేత, వైసీపీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి వైసీపీ టికెట్ ఆశించారు. అయితే, ఆయనకు టికెట్ రాకపోవడంతో పార్టీని వీడారు. ఇక విజయనగరం జిల్లాలోనూ యాదవులు విజయనగరం అసెంబ్లీ సీటును డిమాండ్ చేస్తూ ప్రదర్శనలు చేశారు. విజయనగరం జిల్లాలో 2.5 లక్షల యాదవ ఓట్లు ఉంటే ఒక్క విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోనే 65 వేల ఓట్లు ఉన్నాయంటూ ప్రదర్శనలు చేశారు. గుంతకల్లులోనూ టీడీపీ టికెట్ కోసం యాదవ సంఘాలు డిమాండ్ చేశాయి. గుంతకల్లు అసెంబ్లీ నియోజకవర్గంలో 65 వేల యాదవ ఓట్లు ఉన్నాయని, యాదవులకే టికెట్ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

తేది : 29- 04-2024 ఆంధ్రలక్ష్మి 4 సంపుటి : 15 సంచిక : 33

# బీజేపీకి తెలంగాణపై ఫోకస్ ఏపీపై లేదే!!

భారతీయ జనతా పార్టీ ఒక రాష్ట్రంలో విజయావకాశాల మీద హోప్స్ పెట్టుకుని ఉన్నదా లేదా? అనేది ఆ పార్టీ అగ్రనాయకులు సాగించే ప్రచారం షెడ్యూలు మీద ఆధారపడి ఉంటుంది. నిజంగా సీరియస్‌గా ఎన్నికల్లో తలపడుతూ.. గెలిచే అవకాశం ఉందని భావించే పక్షంలో ఆ పార్టీ ప్రధాన సారథులు నరేంద్రమోడీ, అమిత్ షా ఖచ్చితంగా ఎన్నికల సభలు ప్లాన్ చేసుకుని వస్తారు. వాళ్లు రాకపోయినా, ఏదో మొహమాటంగా సభలు నిర్వహించినా.. ఆ రాష్ట్రంలో వారికి విజయాలమీద పెద్దగా నమ్మకం గానీ, ధ్యాస గానీ లేదని అర్థం. ఆ సిద్ధాంతం ప్రకారం చూస్తే తెలంగాణ మీద అంతో ఇంతో నమ్మకం పెట్టుకుని పోరాడుతన్న కమలదళం ఏపీలో ఎన్డీయే పొత్తుల పేరుతో చంద్రబాబు నాయుడుతో కలిసి సాగిస్తున్న ఎన్నికల సమ రాన్ని లైట్ తీసుకున్నట్టుగా కనిపిస్తోంది. ఏపీలో చెప్పుకోడానికి మాత్రమే ఎన్డీయే కూటమి అన్నట్టుగా వాతావరణం కనిపిస్తోంది. ఓట్ల బదిలీ పద్ధతిగా జరుగుతుందో లేదో తెలియదు. చంద్రబాబు కోవర్టులుగా భాజపాలో ఉన్న వారు మాత్రమే..



సంతోషంగా ఈ పొత్తులతో ముందుకు వెళుతున్నారు. మూడు పార్టీలు సమైక్యంగా ఉన్నాయని చెప్పుకోడానికి, ప్రధాని మోడీ కూడా ఈ మైత్రీబంధానికి విలువ ఇస్తున్నారని చెప్పడానికి అన్నట్టుగా ప్రారంభంలో ఒక ప్రచార సభ నిర్వహించారు. ఆ సభకు మోడీ వచ్చారు గానీ.. ఏదో పైపై మాటలతో తన ప్రసంగాన్ని ముగించారు.

చంద్రబాబు కోరుకున్నట్టుగా జగన్ ను పల్లెత్తు మాట అనలేదు. ఎన్డీయేకు నాలుగువందల సీట్లు ఇవ్వండి అనేది తప్ప ఆయన నోటమ్మట మరో మాట రాలేదు.. కనీసం రాష్ట్రానికి ఒక్క హామీ కూడా ఇవ్వనేలేదు. తీరా ఎన్నికలు ఇంకో రెండు వారాల దూరానికే వచ్చేస్తుండగా.. అసలు మోడీ పర్యటన మళ్లీ ఏపీలో ఉంటుందా? లేదా? అనే సందేహాలు కలుగుతున్నాయి. ప్రధాని మోడీ పర్యటనలు సాధారణంగా చాలా రోజులు ముందే ఖరారవుతాయి. తెలంగాణ మీద ఆ పార్టీకి శ్రద్ధ ఉంది కాబట్టి ఇప్పటికే మోడీ మూడురోజులు కేటాయించినట్టు తెలుస్తోంది. ఈ నెలాఖరులో ఒకరోజున, మే 3,4 తేదీల్లో రెండురోజుల పాటు ఇక్కడ సభల్లో ఆయన పాల్గొననున్నారు. ఆల్రెడీ అమిత్ షా వచ్చి సిద్ధిపేటలో సభ నిర్వహించారు కూడా. కానీ.. ఈమాత్రం ఫోకస్ ఏపీ పై పెట్టడం లేదు. అమిత్ షా సభ అక్కడ షెడ్యూలే కాలేదు. మోడీ వస్తారో లేదో తెలియదు. చెప్పుకోదగ్గ నేత అంటే రాజ్ నాథ్ సింగ్ మాత్రం విశాఖ వచ్చి వెళ్లారు. ఏపీలో పొత్తు రాజకీయాల మీద అసలు ప్రధాని మోడీకి ఇష్టమే లేదని.. ఆయన ప్రచారానికి ఏపీకి రాకపోవచ్చునని.. బలవంతంగా రప్పించినా కూడా.. జగన్ మీద నిందలు వేయడం జరగకపోవచ్చునని పలువురు అంటున్నారు. ఏపీలో ఎన్డీయే కూటమి, చంద్రబాబు జట్టు గెలిచే అవకాశం లేదనే నమ్మకం కారణంగానే.. ప్రచారానికి వెళితే పరువుపోతుందనే భయంతో మోడీ రావడం లేదని కూడా పలువురు అంటున్నారు.

# ఎన్నికల వేళ వదిలిన సెంటిమెంట్ అస్త్రం ఏంటి...?

ఫార్టీ ఇయర్స్ ఇండస్ట్రీ ఆయన. కానీ... గెలుపు రుచి చూసి మాత్రం 20ఏళ్ళయింది. ఈసారి చచ్చీచెడీ టిక్కెట్ తెచ్చుకున్నా... ఎక్కడో తేడా కొడుతోందట. అందుకే ఫైనల్‌గా ఓ సెంటిమెంట్ అస్త్రాన్ని వదిలారాయన. ఆ దెబ్బకు జనం గింగిరాలు తిరిగి... మండుటెండలో మంచు ముక్కలా కరిగిపోయి మరో ఆలోచన లేకుండా తన కోసం మీట నొక్కేస్తారన్నది ఆయన అంచనా. ఇంతకీ ఎవరా లీడర్? ఏంటి ఆయన వదిలిన సెంటిమెంటాస్త్రం? నెల్లూరు జిల్లా సర్వేపల్లి నియోజకవర్గానికి చెందిన సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తెలుగుదేశం పార్టీ ముఖ్య నేతల్లో ఒకరు. మేనమామ నల్లపరెడ్డి శ్రీనివాసులు రెడ్డి నుంచి రాజకీయ ఓనమాలు నేర్చుకున్న సోమిరెడ్డి... నాలుగు దశాబ్దాల నుంచి యాక్టివ్ పాలిటిక్స్‌లో ఉంటున్నారు. కానీ... గెలుపు రుచి చూసి 20ఏళ్ళు అయింది. వరుసగా నాలుగు విడతల నుంచి ప్రత్యక్ష ఎన్నికల్లో ఓడిపోతున్నారాయన. ఈసారి కూడా తీవ్ర ఉత్కంఠ, రకరకాల ఆప్షన్స్‌ని చూసి అవి వర్కౌట్ అవ్వవని తెలిశాకే సర్వేపల్లి టిక్కెట్ ఇచ్చింది టీడీపీ అధిష్టానం. దీంతో గెలుపన్నది లైఫ్ అండ్ డెత్‌గా మారిపోయింది ఆయనకు. అందుకే రకరకాల అస్త్రాలను ప్రయోగిస్తూనే ఫైనల్‌గా బ్రహ్మాస్త్రాన్ని వదలడం నియోజకవర్గంలో హాట్ టాపిక్ అయింది. 1994 ఎన్నికలలో సర్వేపల్లి నుంచి తొలిసారి ఎమ్మెల్యే అయ్యారు సోమిరెడ్డి. చంద్రబాబు క్యాబినెట్లో ఐదు శాఖలకు మంత్రిగా వ్యవహరించారు. 1999లో కూడా రెండోసారి గెలిచి మళ్ళీ మంత్రి పదవి చేపట్టారాయన. కానీ.. 2004 అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్ రెడ్డి చేతిలో ఓడిపోయారు సోమిరెడ్డి. అనంతరం టిడిపి జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. పార్టీ పరంగా పదవులకు ఏ ఇబ్బంది లేకుండా ఎదిగిన మాజీ మంత్రితో ఎన్నికల విజయం మాత్రం దోబూచులాడింది. 2009 ఎన్నికల్లో కూడా అదే సర్వేపల్లిలో అదే ఆదాల చేతిలో ఓడిపోయారాయన. ఇక 2014, 2019లో వైసీపీ అభ్యర్థి కాకాణి గోవర్ధన్ రెడ్డి చేతిలోనూ పరాజయం తప్పలేదాయనకు. 2014లో తాను ఓడినా... టిడిపి అధికారంలోకి రావడంతో ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చి మంత్రిని చేశారు చంద్రబాబు. చివరికి మంత్రిగా ఉంటూ కూడా 2019 ఎన్నికలలో ఓడిపోవడం చర్చనీయాంశం అయింది. ఇక ఈసారి ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న టిడిపి... గెలుపు గుర్రాలనే బరిలోకి దింపాలని డిసైడైంది. వరుసగా మూడుసార్లు ఎన్నికల్లో ఓడిపోయిన వారికి టికెట్ ఇవ్వబోమని ముందే ప్రకటించారు లోకేష్. దీంతో సోమిరెడ్డికి టికెట్ పై అయోమయం నెలకొంది. తొలి రెండు జాబితాల్లో ఆయన పేరు ప్రకటించని అధిష్టానం రకరకాల ఆప్షన్స్ కోసం ప్రయత్నించింది. చివరికి సోమిరెడ్డి కోడలు శృతికి టికెట్ ఇవ్వాలని కూడా అనుకున్నారు. కానీ... వై.సి.పి అభ్యర్థి కాకానిని దీటుగా ఎదుర్కోవాలంటే ఆమె అనుభవం సరిపోదని తానైతేనే కరెక్ట్ అంటూ మాజీ మంత్రి నచ్చజెప్పుకోవడంతో... మరో గత్యంతరం లేక చివరికి ఆయన్నే ఫైనల్ చేసింది అధిష్టానం. టిక్కెట్ ఓకే అయినా... ఇప్పుడు గెలవడమన్నది సోమిరెడ్డికి జీవన్మరణ సమస్య. వరుసగా మూడు సార్లు ఓడిన వారికి టిక్కెట్ లేదని ఇప్పటికే విధాన నిర్ణయం తీసుకునిన టీడీపీ అధిష్టానం ఇంకోసారి ఓడితే ఇక సోమిరెడ్డిని పక్కన పెట్టడం ఖాయమన్న అభిప్రాయం బలంగా ఉంది. ఈ విడతలోనే మరో గత్యంతరం లేక నిక్కీ నీలిగీ టిక్కెట్ తెచ్చుకోగా... ఇప్పుడు తేడా పడితే... మరోసారి ఆ అవకాశం కూడా



ఉండబోదు. అదే పాయింట్ మీద బ్రహ్మాస్త్రాన్ని బయటికి తీశారట ఆయన. తనకు ఇవే ఆఖరు ఎన్నికలని, మద్దతిచ్చి గట్టెక్కించమంటూ వేడుకుంటున్నారట. ఇటీవల పొదలకూరు బహిరంగ సభలో చంద్రబాబు సమక్షంలోనే సోమిరెడ్డి ఈ టాపిక్ తీసుకురావడంపై చర్చ జరుగుతోంది. అలాగే ఇంతకు ముందు టీడీపీ నుంచి వైసీపీలో చేరిపోయిన స్థానిక నాయకుల ఇళ్ళకు వెళ్ళి మరీ రా.. రమ్మని బతిమాలుకుంటున్నట్టు తెలిసింది. మొత్తంగా తనకు ఇవే చివరి ఎన్నికలంటూ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెబుతున్న మాటల్ని సర్వేపల్లి జనం ఎంతవరకు పరిగణలోకి తీసుకుంటారు? కనీసం ఐదోసారైనా ఆయన్ని గట్టెక్కిస్తారా? సెంటిమెంట్ అస్త్రం వర్కౌట్ అవుతుందా అన్నది చూడాలి.

## నగరంలో రోజు రోజుకు పెరిగిపోతున్న హిజ్రాల ఆగడాలు..

నెల్లూరు నగరంతోపాటు తెలుగు రాష్ట్రాల్లో రోజురోజుకు హిజ్రాల ఆగడాలు పెరిగిపోతున్నాయి. శుభకార్యాలను మొదలు కొని ఏ కార్యం జరిగిన పదుల సంఖ్యలో గుంపుగా ఏర్పడి శుభకార్యాలు జరుగుతున్న చోటుకు వస్తున్నారు. తాము అడిగినంత డబ్బు ఇవ్వకపోతే వికృత చేష్టలతో అక్కడి ప్రజలను కుటుంభ సభ్యులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. దీంతో బంధువుల ముందు పరువు పోతుందనే భయంతో వారు అడిగినంత చెల్లించుకోక తప్పడం లేదు. ఇటీవల కాలంలో వీరి ఆగడాలు అధికం అయ్యాయి. అయితే దీనిపై హిజ్రాల సంఘం వారు స్పందిస్తూ.. తాము అలా చేయడం లేదని.. నకిలీ హిజ్రా బ్యాచ్‌లు ఇలాంటి ఘటనకు పాల్పడుతున్నాయని చాలా సార్లు చెప్పుకొచ్చారు. తాజాగా హైదరాబాద్‌లో ఓ పెళ్లి వేడుక జరుగుతున్న ఇంటికి.. హిజ్రాలు వచ్చి నానా హంగామా సృష్టించారు. 25 వేల రూపాయలు కచ్చితంగా ఇవ్వాల్సిందేనని పట్టుబట్టారు. బంధువుల ముందు కుటుంబ సభ్యులతో అసభ్యంగా మాట్లాడారు. ఈ తతంగం మొత్తం అక్కడే ఉన్న ఓ వ్యక్తి వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దీంతో ఇలాంటి చర్యలకు ఎవరైన పాల్పడితే.. వెంటనే 100 కి కాల్ చేయాలని పోలీసులు సూచించారు.

ఫీడ్ బ్యాక్ టు ఆంధ్రలక్ష్మి

'ఆంధ్రలక్ష్మి' వారపత్రికకు సమాజంలో జరిగే అవినీతి, అక్రమాలు మీ దృష్టికి వస్తే మాకు తెలియజేయండి.... మేము నిర్భయంగా ప్రచురిస్తాం...
మీ వివరాలు గోప్యంగా ఉంచుతాం.

Cell : 9640300529

వార్తలకై www.andhralaxmitelugu.in చూడండి

email : Andhralaxminews@gmail.com
www. andhralakshmi@gmail.com, facebook.com/andharalaxmi

తేది : 29-04-2024 ఆంధ్రలక్ష్మి 5 సంపుటి : 15 సంచిక : 33



# ఎన్నికల సంఘం చెప్పినట్లు సీఎస్ వినాలా...? సీఎస్ చెప్పినట్లు ఎన్నికల సంఘం వినాలా..?



ఎన్నికల సంఘం ఆధీనంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పనిచేస్తున్నారా...? ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో ఎన్నికల సంఘం పని చేస్తోందా? ప్రస్తుతం రాష్ట్రంలో పరిపాలన జరుగుతున్న తీరు, మరీ ముఖ్యంగా పింఛన్ల పంపిణీ వ్యవహారం చూస్తుంటే ఎవరికైనా ఇదే సందేహం కలుగుతోంది. సీఎస్ జవహర్‌రెడ్డి ఆదేశం, అభిమతాలకు అనుగుణంగానే ఎన్నికల సంఘం పనిచేస్తున్నట్లు కనిపిస్తోంది. ఎన్నికల కోడ్ అమల్లోకి రాగానే అధికార యంత్రాంగమంతా ఎన్నికల సంఘం ఆధీనంలోకి వెళ్లిపోతుంది. సీఎస్ సహా ఎవరైనా ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా నడుచుకోవాలి. కానీ ఆంధ్రప్రదేశ్‌లో అందుకు భిన్నంగా జరుగుతున్నట్లు కనిపిస్తోంది. వాలంటీర్ల ద్వారా పింఛన్లు పంపిణీ చేయొద్దని మాత్రమే ఎన్నికల సంఘం ఆదేశిస్తే.. సీఎస్ ఏకంగా ఇంటింటికీ పింఛన్ల పంపిణీనే నిలిపేశారు. ఈ వ్యవహారంలో వెంటనే జోక్యం చేసుకుని సరిదిద్దాల్సిన ఈసీ చోద్యం చూస్తూ కూర్చుంది. దాంతో ఏప్రిల్ మొదటివారంలో పింఛన్ల పంపిణీ వ్యవహారం తీవ్ర గందరగోళానికి దారితీసింది. రాష్ట్రవ్యాప్తంగా 32 మంది వృద్ధులు చనిపోయారు. అధికార పార్టీ వృద్ధుల్ని మండుటెండల్లో మంచాలపై ఊరేగిస్తూ నానా హంగామా సృష్టించింది. అయినా ఈసీ ఏ ఒక్కరిపైనా చర్యలు తీసుకోలేదు. మే నెల దగ్గర పడుతున్నా పింఛన్ల వ్యవహారంలో దిద్దుబాటు చర్యలు లేవు. మే నెలలోనైనా ఇంటివద్దకే పింఛన్లు పంపిణీ చేయాల్సిందిగా ఈసీ ఇప్పటికీ ఎందుకు స్పష్టమైన ఆదేశాలివ్వట్లేదు? అంతకుముందు నెల వరకూ కొనసాగిన విధానాన్నే ఇప్పుడూ కొనసాగించాలని ఎందుకు సీఎస్‌కు చెప్పట్లేదు? ఇలాగే ఉంటే ఈసారి కూడా ఏప్రిల్ పరిస్థితులే పునరావృతం కావా? ఎన్నికల సంఘం నిర్దిష్టంగా ఆదేశాలివ్వలేదా? "ఇప్పటికే కొనసాగుతున్న పథకాలకు సంబంధించిన లబ్ధిని వాలంటీర్ల ద్వారా కాకుండా ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా లేదా ప్రభుత్వోద్యోగుల ద్వారా పంపిణీచేయాలని మార్చి 30న ఆదేశాలిచ్చాం. అయితే వివిధ పథకాల (పింఛన్లు సహా) పంపిణీ సక్రమంగా సాగేందుకు తగిన ఏర్పాట్లు చేయకపోవడం వల్ల, పంపిణీ ప్రక్రియ మారడం వల్ల లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నట్లు ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు అందాయి. ఇప్పటికైనా లబ్ధిదారులకు ఇబ్బందులు, అసౌకర్యం కలగకుండా పంపిణీ ప్రక్రియ చేపట్టండి" అని ఎన్నికల సంఘం ఈ నెల 26న సీఎస్‌కు లేఖ రాసింది. ఏప్రిల్ మొదటివారంలో పింఛన్ల పంపిణీలో నెలకొన్న గందరగోళం ఈసీ దృష్టిలో ఉంది. అలాంటప్పుడు కచ్చితంగా లబ్ధిదారుల ఇంటివద్దకే ప్రభుత్వ ఉద్యోగులతో పింఛన్లు పంపిణీ చేయాలని ఈసీ నిర్దిష్టంగా ఎందుకు సీఎస్‌కు ఆదేశాలివ్వట్లేదు? తమ ఆదేశాలను యథాతథంగా అమలు చేయకపోతే తీవ్ర చర్యలు తప్పవని ఎందుకు హెచ్చరించట్లేదు? ఇంకా చెప్పాలంటే ఒక ప్రామాణిక నిర్వహణ పద్ధతి (ఎస్ఓపీ)ని ఖరారు చేసి తదనుగుణంగా పంపిణీచేయాలని కచ్చితమైన ఆదేశాలు ఎందుకు ఇవ్వలేకపోతోంది? ఏదో సీఎస్‌కు సలహా ఇచ్చినట్లు, సూచించినట్లు చెప్పడమేంటి? అంటే సీఎస్ ఆధీనంలో ఈసీ పనిచేయాలా? ఆదేశాల స్ఫూర్తిని పాటించట్లేదని తేటతెల్లమవుతుంటే.. మళ్లీ అదే మాటలా? నిష్పక్షపాతంగా, నిబంధనల ప్రకారం వ్యవహరించే ఏ అధికారైనా ఈసీ ఆదేశాల స్ఫూర్తిని తీసుకుంటే.. అంతకుముందు నెల వరకూ కొనసాగినట్లే ఇంటివద్దకే పింఛన్లను పంపిణీ చేయించాలి. కానీ సీఎస్ జవహర్‌రెడ్డి మాత్రం గ్రామ, వార్డు సచివాలయాల వద్దకే వెళ్లి పింఛన్లు తీసుకోవాలని ఆదేశాలిచ్చారు. మండుటెండల్లో, వృద్ధుల్ని, దివ్యాంగుల్ని, వితంతువుల్ని, అభాగ్యుల్ని సచివాలయాల వద్దకు రప్పించారు. దానికి విపక్షాలే కారణమనే భావన ప్రజల్లో కల్పించి తద్వారా అధికార వైకాపాకు రాజకీయ ప్రయోజనం కలిగించాలనే కుట్రతోనే ఇలా చేశారని ప్రతిపక్షాలు ఆరోపించాయి. కేంద్ర ఎన్నికల సంఘానికి దీనిపై ఫిర్యాదు చేశాయి. కనీసం మే నెల పింఛను అయినా ఇంటి వద్దే అందేలా ఆదేశాలివ్వాలని ప్రతిపక్షాలు వినతులిచ్చాయి. అంటే ఈసీ ఆదేశాల స్ఫూర్తిని సీఎస్ పట్టించుకోలేదని తేటతెల్లమైపోతోంది కదా!

# బరిలో... మాజీ సీఎం ల వారసులు !

సార్వత్రిక ఎన్నికలు రాష్ట్రంలో వచ్చే నెల 13న జరగనున్నాయి. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలను పరిపాలించిన మాజీ ముఖ్యమంత్రుల తనయులు పలువురు ... పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలకు 8 మంది పోటీ చేస్తున్నారు. వీరు కాంగ్రెస్, బిజెపి, వైసిపి, టిడిపి, జనసేనల తరపున బరిలో ఉన్నారు. వారిలో మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డి తనయుడు, మాజీ కేంద్ర మంత్రి కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి కర్నూలు జిల్లా డోన్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టిడిపి అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, ఇండియా బ్లాక్ తరపున కాంగ్రెస్ అభ్యర్థి జి మద్దిలేటితో ఢ కొంటున్నారు. టిడిపి వ్యవస్థాపకులు, సినీ నటులు నందమూరి తారక రామారావు 1983-1995 మధ్య పలు దఫాలు ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆయన కుమారుడు నందమూరి బాలకృష్ణ 2014, 2019 ఎన్నికల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా హిందూపురం ఎమ్మెల్యేగా గెలిచారు. ప్రస్తుతం అక్కడి నుండే పోటీలో ఉండి హ్యాట్రిక్ సాధించాలని ఉవ్విళ్లూరుతున్నారు. ఆయనపై వైసిపి నుంచి దీపిక, ఇండియా బ్లాక్ తరపున కాంగ్రెస్ నుంచి ఇనరుతుల్లా తలపడుతున్నారు. ఇదే నియోజకవర్గం నుండి నందమూరి తారక రామారావు, ఆయన పెద్ద కుమారుడు నందమూరి హరికృష్ణ అంతకుముందు ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. ఎన్టీఆర్ మూడో కుమార్తె దగ్గుపాటి పురంధరేశ్వరి టిడిపి, జనసేన, బిజెపి కూటమి తరపున రాజమండ్రి బిజెపి ఎంపీ అభ్యర్థిగా పోటీకి దిగారు. అక్కడ వైసీపీ నుంచి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, ఇండియా బ్లాక్ నుండి మాజీ పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు పోటీలో ఉన్నారు. 1984 ఆగష్టు 16 నుంచి సెప్టెంబర్ 16 వరకు నాదెండ్ల భాస్కరరావు ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆయన తనయుడు, మాజీ స్పీకర్ నాదెండ్ల మనోహర్ తెనాలి నుంచి జనసేన-



టిడిపి-బిజెపి కూటమి అభ్యర్థిగా రంగంలో ఉన్నా రు. 2004, 2009 ఎన్నికల్లో ఇదే నియోజకవర్గం నుండి గెలిచిన మనోహర్... ప్రస్తుత వైసిపి ఎమ్మెల్యే ఏ శివకుమార్, ఇండియా బ్లాక్ తరపున పోటీలో ఉన్న ఎస్‌కె బాసిత్‌లతో తలపడుతున్నారు. 1990- 1992 మధ్య కాలంలో నెల్లూరు జిల్లా వెంకటగిరి నుండి అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహించిన నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం ఆయన పెద్ద కుమారుడు నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి వైసీపీ నుంచి.బరిలో దిగారు. ఇక్కడ ఆయన మాజీ ఎమ్మెల్యే, టిడిపి అభ్యర్థి కురుగుండ్ల రామకష్ణ, ఇండియా వేదిక తరపున కాంగ్రెస్ అభ్యర్థి పి శ్రీనివాసరావులపై పోటీచేస్తున్నారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 1996 - 2019 మధ్య పలు దఫాలు ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. ఆయన తనయుడు నారా లోకేష్ 2019లో మంగళగిరి నుంచి పోటీ చేసి ప్రస్తుత వైసిపి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి చేతిలో ఓటమి చవిచూశారు. అయితే శాసనమండలిలో ఆయనకు సభ్యత్వం కల్పించి క్యాబినెట్‌లోనూ అవకాశమిచ్చారు. తాజా ఎన్నికల్లో లోకేష్ మరోసారి పోటీ చేస్తుండగా, వైసీపీ నుంచి ఎం.లావణ్య, కాంగ్రెస్ వేదిక తరపున సిపిఎం అభ్యర్థి జొన్న శివశంకర్ ప్రధాన ప్రత్యర్థులుగా ఎన్నికల రంగంలో ఉన్నారు. 2004 నుంచి 2009 వరకు ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న వైయస్ రాజశేఖర్ రెడ్డి కుమారుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పులివెందుల నుంచి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. టిడిపి నుంచి బీటెక్ రవి బరిలోకి దిగారు. ఆయన గత ఎన్నికల్లోనూ జగన్‌తో తలపడ్డారు. ఇక్కడ ఇండియా వేదిక తరపున కాంగ్రెస్ నుండి మూలంరెడ్డి ధృవకుమార్‌రెడ్డి పోటీలో ఉన్నారు. కడప పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా వైఎస్ రాజశేఖరరెడ్డి కుమార్తె, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పోటీ చేస్తున్నారు. ఇక్కడ ప్రస్తుత వైసిపి.,ఎంపి, ఆమె సోదరుడైన వైఎస్ అవినాష్‌రెడ్డి, టిడిపి-బిజెపి-జనసేన కూటమి అభ్యర్థి భూపేష్‌రెడ్డిలతో ఆమె తలపడుతున్నారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో ఇలా.. మాజీ ముఖ్యమంత్రుల వారసులు పోటీలో ఉండడం ఆసక్తికరంగా మారింది.

# కొబ్బరి బోండాల కృత్రిమ కొరత.. పెరుగుతున్న ధరలు



తెలుగు రాష్ట్రాల్లో భానుడి తాపానికి ప్రజలు అల్లాడు తున్నారు. ఎండలు మండిపోతుండటంతో బయటకు రావాలంటేనే జంకుతున్నారు. తప్పని సరి అయితే తప్ప బయటకు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. అలా బయటకు వచ్చే వాళ్లు దాహార్తిని తీర్చుకునేందుకు కూల్ డ్రింక్స్, కొబ్బరి బోండాలు, చెరుకు రసం తాగుతున్నారు. కూల్ డ్రింక్స్ ను నిరాకరించే వాళ్లు ప్రకృతి నుంచి లభించే కొబ్బరి బోండాలపై ఆధారపడుతున్నారు. కొబ్బరి నీళ్లతో ఆరోగ్యానికి కూడా మేలు జరుగుతుండటంతో వాటికే ప్రాధాన్యమిస్తున్నారు. అదే వ్యాపారులకు అదునుగా మారింది. కొబ్బరి బోండాలకు డిమాండ్ పెరగడంతో రెండు రాష్ట్రాల వ్యాపారులు బోండాల ధరలు అమాంతం పెంచేస్తున్నారు. కొందరు సిండికేట్ గా మారి కృత్రిమ కొరతను సృష్టిస్తున్నారు. ప్రస్తుతం కొబ్బరి బోండాలకు డిమాండ్ పెరగడంతో వ్యాపారులు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారు. దీనిని అడ్డుకోవాల్సిన వారు కూడా కమీషన్లకు ఆశ పడి చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో రెండ్రోజుల్లోనే ధరలు పెరిగాయి. నిన్న మొన్నటి వరకు రూ. 30-40 మధ్య ఉన్న ధర కాస్త రూ. 50-60కు చేరుకుంది. ఏపీలోని కర్నూల్ జిల్లాలో ధర మరీ ఎక్కువగా ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సిండికేట్‌కు అడ్డుకట్ట వేయాలని.. ధరలు తగ్గేలా చర్యలు తీసుకోవాలని జనాలు కోరుతున్నారు.

తేది : 29- 04-2024 ఆంధ్రలక్ష్మి 6 సంపుటి : 15 సంచిక : 33

# ఓటరు మనసు గెలవని జగన్ మ్యానిఫెస్టో..!

'మనం చేయనివి కూడా చేసినట్లుగా ఇంత స్ట్రాంగ్‌గా చెప్పొచ్చని మిమ్మల్ని చూస్తేనే తెలుస్తోంది సార్. ఒక వర్గానికి మీరు ఇన్స్పిరేషను.. ఇన్స్పిరేషన్ అంతే!'.. ఓ సినిమాలో అల్లు అర్జున్ డైలాగ్ ఇది. తెల్లారిలేస్తే అబద్ధాలపైనే బతికేస్తూ, బయటకు మాత్రం 'అబద్ధాలంటే నాకసహ్యం' అని చెబుతూ తిరిగే వ్యక్తితో అర్జున్ చెప్పే ఈ డైలాగ్ విశేషంగా ప్రాచుర్యం పొందింది! 2024 ఎన్నికల మ్యానిఫెస్టో విడుదల చేస్తూ ముఖ్యమంత్రి జగన్ చెప్పిన మాటలు విన్నవారికీ ఆ డైలాగే గుర్తొచ్చింది. 'అసలు మీరేమనుకుంటున్నారు జగన్? జనం మీకు మరీ అంత అమాయకుల్లా కనిపిస్తున్నారా?' అనీ అడగాలనిపించింది. చేయనివి చేసినట్టూ, అరకొరగా జరిగినవి పూర్తిగా జరిగిపోయినట్టూ... జగన్ చెప్పిన కబుర్లు, చేసిన విన్యాసాలూ చూసి జనం ముక్కున వేలేసుకుంటున్నారు. ఏంటి సీఎం గారూ.. మ్యానిఫెస్టో అంటే మీకు భగవద్గీత, బైబిలు, ఖురానూనా? 2019 ఎన్నికల మ్యానిఫెస్టోలో 99 శాతం అమలు చేసేశారా? పోలవరం ప్రాజెక్టు అంగుళం కదల్లేదు, మిగతా జలయజ్ఞం ప్రాజెక్టులూ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉన్నాయి. ప్రత్యేక హోదా వంటి ప్రధాన హామీలే పూర్తికానప్పుడు ఇక మ్యానిఫెస్టోని 99 శాతం అమలు చేసేశామని చెప్పడమేంటి జగన్? శెభాష్.. శెభాష్ అంటూ ముఖ్యమంత్రి తన భుజం తానే తట్టుకుంటూ, మ్యానిఫెస్టో అమలు విషయంలో తొంభైతొమ్మిది శాతం మార్కులు వేసేసుకోవడంపై అనేక వ్యంగ్య వ్యాఖ్యలూ వినిపిస్తున్నాయి. ఎప్పుడూ పరీక్షల్లో తప్పే కుర్రాడికి ఈసారికి మార్కులు నువ్వే వేసేసుకోమని చెబితే ఎలా ప్రవర్తిస్తాడో.. ముఖ్యమంత్రి తీరు కూడా అలాగే ఉందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2019 మ్యానిఫెస్టోలో జగన్ హామీ: 'కాపురాల్లో మద్యం చిచ్చుపెడుతోంది. మానవ సంబంధాలు ధ్వంసమై పోతున్నాయి. మేం అధికారంలోకి వచ్చాక మూడు దశల్లో మద్యాన్ని నిషేధిస్తాం. 5 నక్షత్రాల హోటళ్లలో మాత్రమే మద్యం దొరికేలా చేస్తాం' మద్య నిషేధం చేశాకే 2024 ఎన్నికల్లో ఓట్లడుగు తానని చెప్పిందీ మీరే కదా? దశలవారీగా మద్యనిషేధం అని మాట మార్చి.. దాన్ని కూడా అమలు చేయలేదు సరి కదా.. ఊరికి నాలుగైదు బెల్ట్‌షాప్‌లతో మద్యాన్ని మరింత అందుబాటు లోకి తెచ్చారు. ఐదేళ్లలో 'జే బ్రాండ్ల' మద్యం విక్రయాల ద్వారా అధికారికంగా, అనధికారి కంగా ప్రజల నుంచి రూ.1.54 లక్షల కోట్లు కొల్లగొట్టారు. ప్రస్తుత మ్యానిఫెస్టోలో మద్య నిషేధం ప్రస్తావనే తేలేదు. అంత ముఖ్యమైన హామీ పైనే నాలుక మడతేసిన మీరు... భగతవద్గీత, బైబిలు, ఖురాన్ అని చెప్పే మ్యాని ఫెస్టోకి ఏం విలువ ఇచ్చినట్టు? 99 శాతం మార్కులు ఎలా వేసుకుంటారు? ఇది రాష్ట్ర ప్రజల్ని వంచించడం కాదా? "వైఎస్సార్ కలలు గన్న జలయజ్ఞాన్ని పూర్తి చేస్తాం. పోలవరం, వెలిగొండ సహా అన్ని ప్రాజెక్టులూ యుద్ధప్రాతిపదికన పూర్తిచేస్తాం"- అని 2019 మ్యానిఫెస్టోలో ఊదరగొట్టారు. యుద్ధం మాట దేవుడెరుగు.. మీ అస్తవ్యస్త విధానాలతో పోలవరం ప్రాజెక్టు భవిష్యత్తునే అగమ్యగోచరంలోకి నెట్టేశారు. గత ప్రభుత్వ హయాంలో 72 శాతం పూర్తయిన ప్రాజెక్టు పనుల్ని... ఈ ఐదేళ్లలో మరో ఐదారు శాతం మాత్రమే చేశారు. రాష్ట్రంలో జలయజ్ఞం కింద పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, మీరు పాదయాత్రలో ఇచ్చిన హామీల ప్రకారం కొత్తగా తీసుకున్న ప్రాజెక్టుల్ని పూర్తి చేయడానికి కావలసిన నిధులు మీ లెక్కల ప్రకారమే రూ. 1,64,815 కోట్లు కదా? కానీ ఉద్యోగుల జీతాలు కూడా కలిపి గత ఐదేళ్లలో మీరు చేసిన ఖర్చు రూ. 35,265 కోట్లు మాత్రమే కదా? ఈ ఐదేళ్లలో మీరు సాధించిందేంటి? 2019 నాటికే 70 శాతం పనులు జరిగిపోయిన నెల్లూరు, సంగం బ్యారేజీలను పూర్తి చేసి గొప్పలు చెప్పుకోవడమా? వెలిగొండ రెండో టన్నెల్ పూర్తి చేసి ఏకంగా ప్రాజెక్ట్ నిర్మాణమే పూర్తయినట్లు హడావుడి చేయడమా? దేవుడి దయతో ప్రత్యేక హోదా సాధిస్తామని, ఉద్యోగాల విప్లవం తెస్తామని 2019 మ్యానిఫెస్టోలో జగన్ ఊదరగొట్టారు. 25 మంది ఎంపీల్ని గెలిపిస్తే కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా సాధించుకొస్తామని బీరాలు పలికారు. తీరా అధికారంలోకి వచ్చాక తొలి ఢిల్లీ పర్యటనలోనే కాడి కింద పడేశారు. ప్రత్యేక హోదాపై కేంద్రాన్ని అడుగుతూ ఉండడం తప్ప చేయగలిగిందేమీ లేదని చేతులెత్తేశారు. పార్లమెంటులో కీలకమైన బిల్లులు ఆమోదం పొందే క్రమంలో కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వానికి జగన్ బేషరతుగా మద్దతిచ్చారే తప్ప.. ఎప్పుడూ ప్రత్యేక హోదా డిమాండ్‌ను తెరపైకి తేలేదు. '2019 మ్యానిఫెస్టోలో చెప్పినట్లుగా.. పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహమిచ్చాం. మ్యానిఫెస్టోలో చెప్పకపోయినా.. ఎంఎస్ఎంఈలకు రూ. 2,087 కోట్ల ప్రోత్సాహకాలు అందించాం. ఈ 5 ఏళ్లలో రూ. 85,543 కోట్ల పెట్టుబడులు వచ్చాయి' అని జగన్ గొప్పలు చెప్పారు. వైకాపా అధికారంలోకి వచ్చీరాగానే గత ప్రభుత్వం పారిశ్రామికవేత్తలతో కుదుర్చుకున్న ఒప్పందాల సమీక్ష పేరుతో వారిపై వేధింపులకు పాల్పడింది. వివిధ ప్రాజెక్టులకు కేటాయించిన భూముల్ని వెనక్కు తీసుకుంది. వీళ్ల తీరు చూసి రిలయన్స్ సంస్థ రూ. 15 వేల కోట్ల పెట్టుబడుల ప్రతిపాదన ఉపసంహరించుకుంది. విశాఖ నుంచి లులు, ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ వంటి సంస్థల్ని ప్రభుత్వ తరిమేసింది. అమరరాజ బ్యాటరీస్ సంస్థను రాజకీయ కక్షతో వేధింపులకు గురిచేయడంతో.. ఆ సంస్థ తమ విస్తరణ ప్రాజెక్టును తెలంగాణకు తరలించింది. మొత్తం మీద రూ. 1.24 లక్షల కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలు రాష్ట్రం నుంచి తరలిపోయాయి. ఉద్యోగుల్ని ముంచింది కాకుండా.. అబద్ధాలా? జగన్.. అధికారంలోకి వచ్చాక ఉద్యోగుల్ని ముప్పుతిప్పలు పెట్టారు. ఎన్నికల సమయంలో అవగాహన లేక ఆ హామీ ఇచ్చామంటూ సీపీఎస్ రద్దుపై మాట మార్చారు. జీపీఎస్ పేరుతో మరో విధానం తెరపైకి తెచ్చారు. దీన్ని ఉద్యోగులంతా వ్యతిరేకించినా, మొండిగా చట్టం చేశారు. రైతు భరోసా కింద రూ. 50 వేలు ఇస్తామని 2019 మ్యానిఫెస్టోలో చెప్పినా.. ఏటా రూ. 13,500 చొప్పున అయిదేళ్లలో రూ. 67,500 ఇచ్చామని జగన్ గొప్పలు చెప్పారు. పీఎం-కిసాన్ కింద కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న రూ.6 వేలు కూడా కలిపి... రూ. 13,500 ఇస్తున్నారు. ఒక్కో రైతుకి రాష్ట్ర ప్రభుత్వం నికరంగా ఇస్తున్నది ఏటా రూ. 7,500 మాత్రమే. కేంద్రం ఇస్తున్న దాన్నీ రాష్ట్ర ప్రభుత్వ ఖాతాలోనే వేసేసుకుని అబద్ధాలు చెప్పడం రైతుల్ని మోసం చేయడం కాదా? ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల్లోని వివిధ కులాలకు ప్రత్యేకంగా కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తామని మ్యానిఫెస్టోలో జగన్ హామీ ఇచ్చారు. కార్పొరేషన్లయితే ఏర్పాటు చేశారుగానీ, ప్రత్యేకంగా నిధులు, విధులు కేటాయించలేదు. నవరత్న పథకాల నిధుల్నే కార్పొరేషన్ల ద్వారా ఖర్చు చేస్తున్నట్టు చూపించారు. స్వయం ఉపాధి రాయితీ రుణాల్ని ఎత్తేశారు. కేవలం వైకాపా నాయకులకు పదవులు కట్టబెట్టేందుకు, రాజకీయ పునరావాస కేంద్రాలుగా కార్పొరేషన్లను మార్చేశారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులకు ఇచ్చే సామాజిక భద్రత పింఛన్లకు అర్హులను గుర్తించేందుకు ఎక్కడా లేని నిబంధనలూ పెట్టారు. ఆరంచెల వెరిఫికేషన్ పేరుతో లబ్ధిదారుల సంఖ్యలో భారీగా కోత పెట్టారు. అధికారంలోకి వచ్చాక మూడున్నరేళ్లపాటు పెళ్లికానుక అమలు చేయలేదు. 2022 అక్టోబరు నుంచి అమలు చేసినా నిబంధనల కొర్రీలు వేసి అర్హుల సంఖ్య పెరగకుండా చేశారు. ఐదేళ్లలో పేదలకు 25 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తామని హామీ ఇచ్చి, 18.64 లక్షల ఇళ్ల నిర్మాణమే చేపట్టారు. వాటిలో 6.50 లక్షలే పూర్తి చేశారు. ఒక్కో ఇంటికి కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న రూ. 1.80 లక్షల సాయాన్ని కూడా.. రాష్ట్ర ప్రభుత్వమే ఇస్తున్నట్టుగా చెబుతున్నారు. సొంత ఆటో, ట్యాక్సీ నడిపే వారికి ఏటా రూ.10 వేల ఆర్థికసాయం చేస్తామని 2019 మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ఆటో, ట్యాక్సీ, మ్యాక్సీ క్యాబ్‌లు 7.5 లక్షల వరకు ఉండగా, ఇందులో ఏటా సగటున 2.60 లక్షల మందికే రూ.10 వేల చొప్పున సాయం అందించారు. ఒక చేత్తో రూ.10 వేలు ఇస్తూనే... ఐదేళ్లలో భారీగా జరిమానాలు విధిస్తూ ఆటో, ట్యాక్సీ డ్రైవర్ల నడ్డి విరిచారు. నాడు-నేడు కింద 8,534 ఉప ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలు చేస్తామని చెప్పగా.. ఇప్పటికీ 50 శాతం పూర్తి కాలేదు. ప్రాంతీయ, సామాజిక ఆస్పత్రుల భవన నిర్మాణ పనులూ 50 శాతం నిలిచిపోయాయి. 40 పట్టణ ఆరోగ్య కేంద్రాల భవన నిర్మాణాలు ఆగిపోయాయి. రూ.3 వేల కోట్లతో ప్రతి బోధనా సుపత్రిలో అదనపు భవనాల నిర్మాణం ప్రాథమిక దశలోనే ఉంది. 17 కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలలు నిర్మిస్తామని ప్రకటించగా.. ఇప్పటి వరకు ఐదు మాత్రమే వచ్చాయి. ఐదేళ్లల్లో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించలేదు. ఎన్నికల దృష్టిలో యువతను ఆకట్టుకునే ఎత్తుగడలో భాగంగా ఇటీవల 6,100 పోస్టులతో ఇచ్చిన డీఎస్సీ కూడా వాయిదా పడింది. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇస్తామని గత మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీని అటకెక్కించారు. ఆప్కాస్ ఏర్పాటుతోనే పనైపోయినట్లు జగన్ చేతులు దులిపేసుకున్నారు. ఐదేళ్ల పాలనలో అమ్మఒడి నాలుగేళ్లే ఇచ్చారు. ఒక ఏడాది కోత పెట్టారు. రూ. 15 వేలు ఇస్తానని చెప్పి, పాఠశాల నిర్వహణ, మరుగుదొడ్ల పేరుతో రూ.2 వేలు మినహాయించి, రూ. 13 వేలే ఇచ్చారు. రాష్ట్రంలోని భూములన్నింటినీ సమగ్ర రీ-సర్వే చేయించి, భూ యజమానులకు శాశ్వత యాజమాన్య హక్కు కలగజేస్తామని 2019 మ్యానిఫెస్టోలో జగన్ హామీ ఇచ్చారు. రీసర్వే మాటేమోగానీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను తెచ్చి తీవ్ర భయాందోళనలు రేకెత్తించారు. రీ సర్వే పేరుతో మొత్తం అస్తవ్యస్తం చేశారు. చాలామంది రైతులు 10 నుంచి 15 సెంట్ల వరకు భూమి కోల్పోయి లబోదిబోమంటున్నారు.

## ఆక్రమించు.. విక్రయించు...!



నెల్లూరు నగరంలో కబ్జాకు అడ్డూఅదుపు లేకుండాపోతోంది. కొందరు అధికార పార్టీకి చెందిన చోటా నాయకులు పంట కాలువలు ఆక్రమించి యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నారు. నగరం నుంచి వెళ్లే పంట కాలువలు ఆనవాళ్లు లేకుండాపోయాయి. పంట కాలువలను పూడ్చేస్తూ కొందరు.. తమ స్థలాల్లో కలిపేసుకుంటూ మరికొందరు ఆక్రమణలకు పాల్పడుతున్నారు. వీరిలో కొందరు ప్రజాప్రతినిధులు, స్థిరాస్తి వ్యాపారులు, సంఘాల పేరు చెప్పుకొనే వివిధ వర్గాల వారు ఉన్నారు. ఫిర్యాదు చేసినా పట్టించుకోరు. నెల్లూరు నగరం మీదుగా వెళ్లే రామిరెడ్డి కాలువ, జాఫర్‌సాహెబ్ కాలువ, పీటర్‌సన్ కాలువ, మల్లపు కాలువ, ఉయ్యాల కాలువ, గచ్చు కాలువ క్రమంగా కనుమరుగవుతున్నాయి. ఆక్రమణలపై ఫిర్యాదులు వచ్చినా.. వాటి జోలికి వెళ్లడం లేదు. నగరంలో అంకణం స్థలం రూ.2 లక్షలకు పైగా పలుకుతోంది. నగరపాలకసంస్థ, నీటిపారుదలశాఖ అధికారులు పంట కాలువలు నగర పరిధిలో ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించలేని దుస్థితిలో ఉన్నారు. ఆక్రమణల కట్టడికి కనీస చర్యలు లేవు. నెల్లూరు నగరం సమీపంలో పెన్నా నది నుంచి సర్వేపల్లి, జాఫర్‌సాహెబ్ కాలువల ద్వారా సాగునీరు సరఫరా అవుతుంది. సర్వేపల్లి కాలువ హరనాథపురం వద్ద కృష్ణపట్నం కాలువగా చీలి ముత్తుకూరు రోడ్డు వెంబడి ధనలక్ష్మీపురం, బ్రహ్మదేవి వరకు 13కి.మీ. సాగుతుంది. నెల్లూరు నుంచి ముత్తుకూరు వెళ్లే మార్గం వెంబడి పారిశ్రామికాభివృద్ధి జరుగుతోంది. కాలువ గట్టు ఒకవైపు ఆక్రమించి ఇళ్ల నిర్మాణాలు జరిగాయి.కొన్నిచోట్ల దుకాణాలు ఏర్పాటు చేశారు. ఆక్రమణలతో కాలువ కుంచించుకుపోయి.. పూడిక తీసేందుకు యంత్రాలు దింపలేని పరిస్థితి నెలకొంది. నగరం అభివృద్ధి చెందడంతో భూములు రియల్ ఎస్టేట్లుగా మారిపోయాయి. నెల్లూరు నగరంలో స్వర్ణాల చెరువు నుంచి వచ్చే పంట కాలువలు ద్వారా సాగునీటితో రైతులు పంటలు పండించుకునేవారు. దీంతో పంట కాలువలు సాగునీరు అందించడం లేదు. పంట కాలువలు ఆక్రమణల కారణంగా గతంలో మన్సూర్‌నగర్ మునిగిపోయింది. పంట కాలువలను వైకాపా ప్రభుత్వం, నగరపాలకసంస్థ పట్టించుకోవడం లేదు. వైకాపా ప్రభుత్వంలో కాలువలు పూర్తిగా ఆనవాళ్లు కోల్పోతున్నాయి. కాలువల గురించి కార్పొరేషన్, ఇరిగేషన్ శాఖలు పట్టించుకోవడం లేదు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నెల్లూరు నగరాన్ని పట్టించుకోవడం లేదు. వైకాపా ప్రభుత్వం కాలువలపై ఉన్న ఆక్రమణలను తొలగించాలి. ప్రభుత్వం పంట కాలువల్లో నీరు పారే విధంగా చర్యలు తీసుకోవాలి. ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుందని నగర ప్రజలు కోరుతున్నారు.




# నెల్లూరు సిటీలో గెలిచే రారాజు ఎవరు...? కిరీటం ఎవరికి..?





ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ గెలిచి తీరాలని పట్టుబడుతున్న నియోజకవర్గాల్లో నెల్లూరు సిటీ నియోజకవర్గం ఒకటి. ఇక్కడ నుంచి గెలిచి తీరాలని చంద్రబాబు పట్టుదలతో ఉన్నారు. ఈ నేపథ్యంలోనే గత ఎన్నికల్లోపరాజయం పాలైనప్పటికీ.. మాజీ మంత్రి పొంగూరు నారాయణకు ఆరు మాసాల ముందుగానే ఇక్కడ బాధ్యతలు అప్పగించారు. గత రెండు ఎన్నికల్లోనూ వైసీపీ ఇక్కడ విజయం దక్కించుకుంది. మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ ఇక్కడ విజయం దక్కించుకున్నారు. ప్రస్తుతం ఆయనను నరసాపురం ఎంపీగా పంపించడంతో ఇక్కడ నుంచి బలమైన అభ్యర్థిని వైసీపీ పోటీకి నిలపలేక పోయింది. అయితే.. సామాజిక వర్గాల ప్రయోగంలో భాగంగా మైనారిటీ నాయకుడు మహమ్మద్ ఖలీల్ అహ్మద్‌కు అవకాశం ఇచ్చారు. అయితే.. మైనారిటీ ఓటు బ్యాంకు పెద్దగా లేకపోవడం గమనార్హం. ఈ నియోజకవర్గంలో రెడ్లు, బీసీలు ఎక్కువగా ఉన్నారు. ఇదే గత రెండు ఎన్నికల్లో వైసీపీకి ప్లస్ అయింది. అయితే.. ఇప్పుడు మైనారిటీ అభ్యర్థికి ఇవ్వడం.. సిట్టింగ్ నేతను మార్చేయడంతో సమీకరణలు మారిపోయాయి. మరోవైపు.. వైసీపీలో ఉన్న అసంతృప్తుల కారణంగా.. పలువురు నాయకులు.. టీడీపీలోకి జంప్ చేశారు. వీరంతా వైసీపీ ఓటమిని చూస్తామని పట్టుబట్టడం టీడీపీకి కలిసివస్తోంది. ఇప్పటి వరకు ఉన్న అంచనాలు.. వస్తున్న సర్వేలు అన్నీ కూడా.. సిటీ నియోజకవర్గంలో నారాయణ గెలుపు తథ్యమని చెబుతుండడం మరో విశేషం. ఇదిలావుంటే.. నారాయణ ప్రచారంలో దూసుకు పోతున్నారు. ఆయన కుటుంబం మొత్తం కూడా ప్రచారంలోనే ఉంది. భార్య, కుమార్తెలు, అల్లుళ్లు కూడా.. ప్రచారం చేస్తున్నారు. గత ఎన్నికల్లో ఓడిపోయిన సానుభూతి, మార్పు కోరుకుంటున్న నాయకులు.. కూడా నారాయణకు జైకొడుతున్నారు. వీటికి తోడు.. వైసీపీ ప్రభుత్వం నారాయణపై పెట్టిన కేసులు, వేధింపులను కూడా ప్రచారంలోకి తీసుకువస్తున్నారు. అదేవిధంగా గత పదేళ్లుగా వైసీపీ ఇక్కడ గెలిచినా..ఏ అభివృద్ధీ జరగలేదని.. నియోజకవర్గంలో కక్షలు పెంచారనే వాదనను నారాయణ వినిపిస్తున్నారు. ఏతావాతా ఎలా చూసుకున్నా.. నియోజకవర్గంలో వైసీపీ ప్రచారం కంటే కూడా.. రెండు రెట్లు టీడీపీ నేత నారాయణ దూసుకుపోతున్నారనడంలో ఎలాంటి అతిశయోక్తీ లేదు. మరి తీర్పు ఎలా ఉంటుందో చూడాలి.

## టిడిపి కొంపముంచనున్న బిజెపి ప్రకటనలు





రాష్ట్రంలో ముస్లిం రిజర్వేషన్ల వ్యవహారం తీవ్ర చర్చనీయాంశం అవుతోంది. రాష్ట్రానికి వచ్చిన కేంద్ర మంత్రి, బిజెపి నాయకులు పియూష్ గోయల్ విజయవాడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముస్లిం రిజర్వేషన్ల అంశాన్ని ప్రస్తావించారు. అసలు అవి రిజర్వేషన్లు కావనే విధంగా ప్రకటించారు. దీంతో బిజెపితో పొత్తుపెట్టుకుని ఎన్నికల్లోకి వెళ్లిన టిడిపి అధినేత చంద్రబాబునాయుడు గొంతులో పచ్చివెలక్కాయ పడినట్లయింది. మతోన్మాద ఎజెండాను ముందుకు తీసుకెళుతున్న బిజెపి దానిలో భాగంగానే రాష్ట్రంలో ముస్లిం వ్యతిరేకతను రెచ్చగొట్టేందుకు వీలుగా రిజర్వేషన్ల అంశాన్ని ముందుకు తెచ్చింది. ఇతర కులాలను రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించిందనే విమర్శలూ ఉన్నాయి. కేంద్రమంత్రి ప్రకటనతో రాష్ట్రంలో ఉన్న ముస్లిం మైనార్టీలలో తీవ్ర ఆందోళన మొదలైంది. దీనికితోడు ముస్లిములు అధికంగా ఉన్న ఒకటీ రెండు నియోజకవర్గాల్లో నేరుగా బిజెపి నేతలు రంగంలోకి దిగారు. గిరిజనులు ఎక్కువగా ఉన్న ఏజెన్సీలోనూ ఎంపి అభ్యర్థిగా బిజెపి నాయకులను దింపారు. ఈ నేపథ్యంలో ముస్లింలు, గిరిజనుల్లో తీవ్ర అభద్రతా భావం ఏర్పడింది. అలాగే సిఎఎ అమలుపై ఇటీవల కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. అతేకాదు, తాము తిరిగి కేంద్రంలో అధికారంలోకొస్తే సిఎఎను అమలు చేసి తీరతామని అమిత్‌షా వంటి వారు కుండబద్దలు కొడుతున్నారు. ఇది టిడిపి, జనసేన పార్టీలకు మైనార్టీల ఓటర్లను దూరం చేయనుందనే అభిప్రాయం టిడిపి సీనియర్ నేతల్లో వ్యక్తమవుతోంది. బిజెపి ప్రకటనల వల్ల మైనార్టీల నుండి రావాల్సిన ఓట్లు రావని కొంతమంది అసహనం వ్యక్తం చేస్తున్నారు. నాయకుల్లోనే ఎటూ తేల్చుకోలేని పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలో విజయవాడ పశ్చిమ, గుంటూరు ఈస్ట్, నెల్లూరు సిటీ, నెల్లూరు రూరల్, కర్నూలు, కడప, అనంతపురం అర్బన్, నంద్యాల, ఆదోని, మదనపల్లి, ప్రొద్దుటూరు, చిత్తూరు, తెనాలి, పొన్నూరు, మచిలీపట్నం, ఒంగోలు, హిందూపురం, గుంతకల్లు, కదిరి, రాయచోటి, నరసరావుపేట, కావలి, చిలకలూరిపేట, ధర్మవరం, ఆళ్లగడ్డ, బనగానపల్లి, ఆత్మకూరు, నందికొట్కూరు, శ్రీశైలం నియోజకవర్గాల్లో ముస్లిములు పార్టీల గెలుపోటములను ప్రభావితం చేసే స్థాయిలో ఉన్నారు. చాలా నియోజకవర్గాల్లో కనీసం 20 వేలకు పైబడి ముస్లిం ఓటర్లు ఉన్నారు. రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో 2011 జనాభా లెక్కల ప్రకారం 36,17,713 మంది ముస్లిములు ఉన్నారు. ఇప్పుడు వారంతా బిజెపి విద్వేష ప్రకటనలతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బిజెపి నాయకులు ముస్లిం రిజర్వేషన్ల అంశాన్ని ప్రస్తావించడం వెనుక పెద్ద ఎత్తున పార్టీ పథక రచన ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటి వరకూ బిజెపి నాయకులు చెబితే పట్టించుకునేవారు లేరు. ఇప్పుడు టిడిపి నాయకులు కూడా కచ్చితంగా వారేమి చెబుతున్నారో వినాల్సిన పరిస్థితి వచ్చింది. ఎన్నికల తర్వాత ఒకవేళ తమ ప్రభుత్వం ఏర్పడితే తాము చేసిన ముస్లిం రిజర్వేషన్ల వ్యతిరేక ప్రకటన అంశమే తమకు ఓట్లు తెచ్చిపెట్టిందని ప్రచారం చేసుకుని మతోన్మాద భావజాలాన్ని మరింత విస్తృతంగా ప్రచారంలోకి తీసుకెళ్లేందుకు తమకు ఉపయోగ పడుతుందనే ఉద్దేశంతోనే బిజెపి నాయకులు రాష్ట్రంలో ఉద్దేశపూర్వకంగా ముస్లిం రిజర్వేషన్ల అంశాన్ని ప్రస్తావిస్తున్నారనే అభిప్రాయం వ్యక్త మవుతోంది.

## ఇద్దరు బడా వ్యాపారుల మధ్య మాజీ ఐఏఎస్ ...







సింహపురిలో 2024 సార్వత్రిక ఎన్నికలు ఉత్కంఠ రేపుతున్నాయి. నెల్లూరు పార్లమెంట్ స్థానానికి టిడిపి నుంచి పెద్ద కాంట్రాక్టర్ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వైసిపి నుంచి ప్రముఖ వ్యాపారవేత్త వేణుంబాక విజయసాయిరెడ్డి, ఇండియా బ్లాక్ మద్దతుతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా జిల్లా పూర్వ కలెక్టర్ కొప్పోలు రాజు ప్రధాన పోటీలో ఉండడంతో ముగ్గురి మధ్య ఆసక్తిర పోరు సాగుతోంది. రెండు నెలల క్రితం వైసిపి అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి స్వయంగా ప్రకటించడంతో ఆయన ప్రచారం ప్రారంభించారు. అయితే జిల్లాలో ఎమ్మెల్యేల ఎంపికకు సంబంధించి తనను సంప్రదించలేదనే కారణంతో వేమిరెడ్డి ... జగన్ పట్ల, వైసిపి పట్ల అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సమయంలోనే టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ..సోమిరెడ్డి చంద్రమోహనరెడ్డి ద్వారా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి కబురు చేశారు. ఈ పరిణామాల అనంతరం వేమిరెడ్డి.. వైసిపిలో పదవులకు, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసి టిడిపిలో చేరిపోవడం, ఎంపి టికెట్‌తో పాటు ప్రభాకరరెడ్డి భార్య ప్రశాంత్‌రెడ్డికి కోవూరు అసెంబ్లీ స్థానం దక్కడం వెంట. వెంటనే జరిగిపోయాయి. దీంతో వేమిరెడ్డిని ఓడించడానికి గత ఏడాదే రాజ్యసభకు ఎంపికైన వేణుంబాక విజయసాయిరెడ్డిని జగన్ రంగంలోకి దింపారు. నెల్లూరు జిల్లా ముత్తకూరు మండలం తాళ్లపూడి వాసి, ఆర్థికంగా బాగా స్థిరపడిన విజయసాయిరెడ్డి ప్రస్తుతం ఆ పార్టీలో రెండో స్థానంలో ఉన్నారు. టిడిపి, వైసిపి అభ్యర్థులు నువ్వా, నేనా అన్నట్లు ప్రచారం చేస్తున్నారు. ఆయా పార్టీల్లో గ్రూపులను ఏకం చేసి తమ విజయానికి ఇబ్బంది లేకుండా వేమిరెడ్డి, విజయసాయిరెడ్డి ప్రయత్నిస్తున్నారు. ఇద్దరు బడా నేతలు నువ్వా, నేనా అన్నట్లు ఉన్న పరిస్థితుల్లో ఇండియా వేదిక తరపున కాంగ్రెస్ అభ్యర్థిగా కొప్పోలు రాజును రంగంలోకి దింపింది. 1988 నుంచి 1991 వరకు ఆయన ఇక్కడ కలెక్టర్‌గా పనిచేశారు. సారా వ్యతిరేక, అక్షరాస్యతా, పొదుపు ఉద్యమాల్లో ప్రజల పక్షాన నిలబడ్డారు. ఆయన అభ్యర్థి అయితే ఇండియా బ్లాక్‌కు ఆదరణ ఉంటుందని కాంగ్రెస్ భావిస్తోంది. వామపక్షాలకు ప్రధానంగా సిపిఎంకు జిల్లాలో బలమైన ఓటింగ్ ఉంది. ప్రజా కలెక్టర్‌గా పేరు, కాంగ్రెస్ సాంప్రదాయ ఓటింగ్,. వామపక్షాలు, ఇతర మద్దతు పార్టీల ఓటింగ్ రాజుకు కలిసొచ్చే అంశంగా కనిపిస్తున్నాయి. ఎవరి ఓట్లకు ఇండియా వేదిక చిల్లు పెడుతుందోనని ఉత్కంఠ రేపుతోంది. ఈ త్రిముఖ పోటీలో ఎవరిని విజయం వరిస్తుందో వేచి చూడాలి !

# సార్వత్రిక ఎన్నికలపై బెట్టింగుల జోరు..!

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో బెట్టింగుల వ్యవహారం ఊపందుకుంది. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించకముందు నుంచే అభ్యర్థులకు సీట్ల కేటాయింపులపై భారీ స్థాయిలో బెట్టింగులు జరగ్గా.. ప్రస్తుతం అభ్యర్థుల గెలుపోటములు, మెజార్టీలపై పెద్దస్థాయిలో పందేలు జరుగుతున్నాయి. బెట్టింగునే వ్యాపకంగా చేసుకున్న పందెం రాయుళ్లతోపాటు, చాలా మంది ఈసారి బెట్టింగుల వైపు మొగ్గు చూపారు. వీరంతా రూ.వేల నుంచి రూ.కోట్ల వరకు బెట్టింగులు కాస్తున్నారు. ఇద్దరు నుంచి పది మంది వరకు ఒక సమూహంగా ఏర్పడి నగదు సేకరణ చేసి, బాండ్లు రాసుకుని, మధ్యవర్తిని పెట్టుకుని బెట్టింగులు కాస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో అనేక మంది ఐపిఎల్ మ్యాచ్‌ల పుణ్యమా అని బెట్టింగుల్లో అడుగుపెట్టేశారు. ఇదే క్రమంలో సార్వత్రిక ఎన్నికలు సమీపించిన తరుణంలో పార్టీల గెలుపోటములపై ఎన్నడూలేని విధంగా బెట్టింగులకు పాల్పడుతూ, రూ.కోట్లలో కాస్తున్నారు. అనేక మంది స్థలాలు, పొలాలు తనఖాపెట్టి



మరీ నగదు తీసుకొచ్చి బెట్టింగులు కాస్తుండగా, మరికొందరు పరువు ప్రతిష్టలకు పోయి ఆ స్థలాలు, పొలాలనే బెట్టింగు వేస్తున్నారు. రాజకీయ పక్షాలు ఎంపి, ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటించినప్పటి నుంచి ఒక్కసారిగా ఊపందుకున్న బెట్టింగు వ్యవహారం.. అభ్యర్థుల నామినేషన్‌లతో పీక్ స్థాయికి చేరుకుంది. వివిధ రకాల సంస్థలు ఇచ్చిన సర్వేలు, ప్రజల అభిప్రాయాలు ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకుంటున్న బెట్టింగు రాయుళ్లు ఎంత మొత్తంలో అయినా కాసేందుకు వెనుకాడుట లేదు. ఉమ్మడి కృష్ణా, ఉభయగోదావరి, గుంటూరు, నెల్లూరు, ప్రకాశం, రాయలసీమలోని కొన్ని జిల్లాల్లో ఈ బెట్టింగులు విపరీతంగా జరుగుతున్నాయి. రాష్ట్రంలో టిడిపి, జనసేన, బిజెపితో కూడిన ఎన్‌డిఎ కూటమి ఓ వైపు, అధికార వైసిపి మరోవైపు హోరాహోరీగా ఈ ఎన్నికల్లో తలపడుతున్నాయి. కాంగ్రెస్, సిపిఎం, సిపిఐతో కూడిన ఇండియా వేదిక కూడా పెద్దస్థాయిలోనే అభ్యర్థులను రంగంలోకి దింపి, ఎన్నికల ప్రచారంలో ముందుంది. ఈ నేపథ్యంలోనే రానున్న పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయి? ఏ పార్టీ అధికారం చేజెక్కించుకుంటుంది? ఏ అభ్యర్థికి ఎంత మెజార్టీ వస్తుంది? అన్న అంశాలపైనే ఎక్కువ శాతం బెట్టింగు జరుగుతోంది. ప్రధానంగా మంగళగిరి నుంచి పోటీ చేస్తున్న టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ గెలుపోటములపై బెట్టింగులు జరుగుతున్నాయి. అలాగే పిఠాపురం నుంచి పోటీ చేస్తున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్ గెలుపుపై, మెజార్టీపై ఎక్కువగా బెట్టింగులు జరుగుతున్నాయి. రాష్ట్రంలోని ఎన్నికలకు సంబంధించి ప్రత్యేకంగా కొన్ని యాప్‌లు, ఆన్‌లైన్ సంస్థలు కూడా నేరుగా బెట్టింగులు నిర్వహిస్తున్నాయి. ఐపిఎల్, ఇతర క్రికెట్ మ్యాచ్‌ల మాదిరి బుకీల ద్వారా బెట్టింగులు నిర్వహిస్తున్నాయి. ఐపిఎల్ మ్యాచ్‌లకు బెట్టింగులు నిర్వహించే ఒక అంతర్జాతీయ సంస్థ ఈ బెట్టింగులోకి దిగినట్లు సమాచారం.

# ఎన్నికల అక్రమ నిధులు... '2'వీలర్‌లలో తరలిపోతున్నాయా...?

ఎన్నికల్లో అక్రమంగా ప్రవహించే మద్యానికి వెదజల్లుతున్న 'ఓటుకు నోటు'లు అరికట్టి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిస్తామని ప్రకటించుకున్న ఎన్నికల సంఘాన్ని దారిమళ్లించే క్రమంలో రాజకీయ పార్టీల నాయకులు తమ నైజాన్ని ప్రదర్శిస్తున్నారు. ఎన్నికల అక్రమ నిధుల వ్యయాన్ని అరికట్టేందుకు, నిధులు ఒక చోటు నుండి మరో చోటికి బదిలీ కాకుండా చూసేందుకు నిఘా కొరకు అనేక కూడళ్ళలో పోలీసు పికెటింగ్ ఏర్పాటుచేసి వచ్చిపోయే వాహనాలను తనిఖీలు చేస్తూ... ఎప్పుడో నామమాత్రంగా ఒకటి అరా కేసులు పట్టుకుంటూ తాము విధులు నిర్వహిస్తున్నామని ప్రకటించుకుంటున్నాయేగాని, యథావిధిగా ఎన్నికల్లో అక్రమ నిధుల వ్యవహారం కొనసాగుతూనే వుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అలాగే అక్రమ మద్యం సైతం ఏరులై పారుతోందని ఒకరిపై మరొకరు విమర్శలు గుప్పించుకొంటున్నారు. అధికారపక్షానిది, ప్రతిపక్షానిదీ ఒకేదారి. ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడి విజయం సాధించాలన్న ఆతృతతో అనేక దారులు వెతుకుతున్న రాజకీయ పార్టీలను కట్టడి చేయటంలో పోలీసు యంత్రాంగం ఎన్నికల కమిషన్ ఘోరంగా విఫలమైందనే విమర్శలు వున్నాయి. నామమాత్రపు తనిఖీలే తప్ప అసలు నిధులు ఏమార్గంలో తరలిపోతున్నాయో కనిపెట్టే పరిస్థితిలో పోలీసు విభాగం లేదని మేధావి వర్గం విమర్శిస్తోంది. భారీ వాహనాలను, కార్లను, జీపులు లాంటి వాహనాలపైనే దృష్టిపెట్టి వాటిని మాత్రమే పరిశీలిస్తున్న పోలీసులు 2వీలర్లలో ముఖ్యంగా స్కూటీ, యాక్టివా లాంటి వాహనాల్లో సుమారు పాతిక నుంచి 50 లక్షలవరకు ఒక్కసారిగా తరలించవచ్చని, ఆ అవకాశం వుందని పలువురు విమర్శిస్తున్నారు. పెద్దపెద్ద





వాహనాలు అయితే రహదారులపైనే వస్తుంటాయి కాబట్టి వాటిని కనిపెట్టి గుర్తించి విచారణ చేసే అవకాశం వుంటుంది. అయితే ద్విచక్ర వాహనాలు సందుగొందుల్లో పోలీసుల కంట పడకుండా తప్పించుకునే పరిస్థితి వుంటుంది కాబట్టి రాజకీయ పార్టీలు సులభంగా తమ అక్రమ నిధులు తరలించేందుకు ద్విచక్రవాహనాలనే ఎంపికచేసుకొని వాటిద్వారానే నిధులను తరలిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్కూటీ పదిసార్లు రవాణా సాగిస్తే... సుమారు 5 కోట్లరూపాయలవరకు తరలించే అవకాశం వుంటుందని పోలీసువారు స్కూటీల ఇన్నర్ లగేజ్ బాక్స్‌ను పరిశీలించకుండా వదిలివేయడం వల్ల ఈ అక్రమ నిధులు తరలిపోతున్నట్టు పలువురు విమర్శిస్తున్నారు. ఆధునిక యుగంలో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకొంటూ ముందుకు దూసుకుపోతున్న రాజకీయ పార్టీలతో పాతకాలపు నాటి పంథానే అనుసరిస్తున్న పోలీసు సిబ్బంది వారిని కట్టడిచేయలేకపోతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్నికల్లో కరపత్రాలు, వాగ్దానాలు, మేనిఫెస్టోలు, పార్టీలపై అభిప్రాయం, నాయకులపై గౌరవంతో పనిలేకుండా కేవలం కరెన్సీకి మాత్రమే ప్రాధాన్యతనిచ్చి ఎన్నికలు జరపాలనే స్థాయికి ఎదిగిపోయిన రాజకీయపార్టీలు ఓటరుకు 'నోటు' చెల్లించే మార్గానికి సరికొత్త పద్ధతులను కొనసాగిస్తోంది. ఆ క్రమంలోనే చట్టం ఎన్ని కట్టుబాట్లు ఏర్పాటు చేసినా వాటినిమీరి సరికొత్త పంథాలో తమదైన శైలిలో చట్టాన్ని మోసం చేస్తున్నారు. ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు ఎన్నిపాట్లయినా పడుతున్న రాజకీయ పార్టీలు చివరిగా నోటుతోనే అధికారాన్ని చేజిక్కించుకోవటం, మద్యంతోనే ఓటను చేజిక్కించుకోవడం తమకున్న రాజకీయ పరిజ్ఞానం అంతవరకే ఉపయోగించుకొంటున్న రాజకీయనాయకుల్లో మార్పు రానంతవరకు చట్టం ఎన్ని కట్టుబాట్లు పెట్టినప్పటికీ ప్రయోజనం శూన్యమని స్పష్టమవుతోంది. నాయకులు వాహనాల్లో మద్యం, ధనం తరలిస్తున్నారని మీడియా గగ్గోలుపెడుతున్నా... ఎన్నికల కమిషన్ నిఘా ఏర్పాటు చేసినా... నాయకులు తమ విధులు బాధ్యతతో కొనసాగించినట్లుగా ఈ అక్రమ దందాను నిర్వహిస్తున్నారు. ద్విచక్రవాహనాల్లో తరలిపోతున్న అక్రమ ధనం, మద్యంపై కూడా నిఘా పెట్టి కట్టడి చేసినట్లయితే... ఎంతో కొంత మేలు జరుగుతుందని పలువురు కోరుతున్నారు. ఇంతవరకు ఎన్నికల కమిషన్ ఆ దిశగా దృష్టిసారించకపోవడం విమర్శలకు తావిస్తోంది. భారీ వాహనాలను మాత్రమే, జాతీయ రహదారులను మాత్రమే పరిగణలోకి తీసుకొని తనిఖీలు నిర్వహిస్తున్న సిబ్బందికి ద్విచక్రవాహనాలను తనిఖీలు చేసే సమయం, తగినంత సిబ్బంది లేకపోవడంవల్ల వీలుకావడంలేదనేది ప్రభుత్వ విభాగాల వాదన. ఒకవేళ ద్విచక్రవాహనాల్లో తరలివెళ్లినా... తక్కువపాటి మొత్తంలోనే తరలిపోతున్నదనే అభిప్రాయంతో వారు ఆ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నట్లు లేదనేది స్పష్టమవుతోంది. అయితే అదేపనిగా నగదు తరలింపుకే ద్విచక్రవాహనాలను తిప్పుతున్నారని ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు రుజువు చేస్తున్నాయని, ఎన్నికల సిబ్బంది, పోలీసు సిబ్బంది ద్విచక్రవాహనాలపై కూడా దృష్టిపెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

Edited, Printed, Published and Owned by Shaik Ghouse Basha, Printed at Mohammed Press, D.No. 7/429, Railway Street, Ranganayakulapet, Nellore - 524 001, Andhra Pradesh, Publihsed at D.No. 7/429, Railway Street, Ranganayakulapet, Nellore - 524 001. Andhra Pradesh,
Editor : Shaik Ghouse Basha Cell : 9640300529